

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 07-03-2025 | సంపుటి - 21 సంచిక - 316 రూ : 4 | పేజీలు: 8




# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

- విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో అవకాశం
- ఎస్సీ వర్గీకరణపై ఏకసభ్య కమిషన్ నివేదికకు ఆమోదం
- ఆర్ఆర్ఆర్ వరకు హెచ్ఎండీఏ విస్తరణ
- 30వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీ
- 10,954 మంది గ్రామ పరిపాలనాధికారుల నియామకం
- నూతన పర్యాటక పాలసీకి పచ్చజెండా
- యాదగిరిగుట్టకు తితిదే తరహాలో ప్రత్యేక బోర్డు
- రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయాలు

హైదరాబాద్: రాష్ట్రంలో బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఎస్సీ వర్గీకరణపై జస్టిస్ షమీమ్ అక్తర్ ఇచ్చిన సవరణ నివేదికను ఆమోదించింది. రాష్ట్రాన్ని కోర్, అర్బన్, రూరల్ సెక్టార్లుగా విభజించిన ప్రభుత్వం.. రీజినల్ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) బఫర్ (2 కి.మీ.) వరకు హెచ్ఎండీఏ ప్రాంతం పరిధిని విస్తరించింది. దాదాపు 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేయాలని నిర్ణయించింది. ఫ్యూచర్ సిటీ ప్రాంత అభివృద్ధి అథారిటీ (ఎఫ్‌సీడీఏ) ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో మే నెలలో మిస్ వరల్డ్ 2025 పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని, ప్రపంచవ్యాప్తంగా 140 దేశాల నుంచి వచ్చే అతిథులకు ఎలాంటి లోటు లేకుండా సౌకర్యాలు కల్పించాలని నిర్ణయించింది. తెలంగాణ తొలి పర్యాటక విధానం2025కు పచ్చజెండా ఊపింది.

తరువాయి 2లో

## సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే కీలకం

- చేయగలిగే పనులపైనే దృష్టి పెట్టాలి
- అప్పుడే రాష్ట్రం మరింత వృద్ధిలోకి..
- సీఎంకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి సూచన
- ఏపీ భవిష్యత్ మార్చాలన్నదే నా కల
- అందుకే భారీ లక్ష్యాలన్న చంద్రబాబు
- మాజీ మంత్రి దగ్గుబాటి రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకావిష్కరణ

విశాఖపట్నం: 'చంద్రబాబునాయుడు పరిపాలనాదక్షుడు అనడంలో సందేహం లేదు. ఆయన అభివృద్ధి కాముకుడు. ఆలోచనలు కూడా మంచివి. ఐతే అవి చాలా ఎక్కువగా ఉంటాయి. అదే సమస్య. మనం ఉన్న సమయాన్ని, మనకిచ్చిన అవకాశాన్ని గుర్తు పెట్టుకుని.. ఆ పరిధిలో చేయదగిన వాటిపై ఎక్కువగా దృష్టిపెడితే రాష్ట్రం మరింతగా అభివృద్ధి చెందుతుందని భావిస్తున్నా' అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు సూచించారు. రాష్ట్రాన్ని బాగుచేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని.. పార్టీలకు అతీతంగా అందరూ ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. 'సభలో

తరువాయి 2లో




## ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపిక షురూ...



- ప్రారంభమైన రీవెరిఫికేషన్ ప్రక్రియ
- నియోజకవర్గానికి 3,500 ఇళ్ల మంజూరులో భాగంగా విచారణ

హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపికలో భాగంగా గ్రామాల్లో అధికారులు రీవెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ఇవ్వాలని నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. జనవరి 26న రాష్ట్రంలో మండలానికి ఒక గ్రామం చొప్పున మొత్తం 562 పంచాయతీల్లో పథకాన్ని ప్రారంభించి అధికారులు అర్హుల జాబితాను వెల్లడించారు. తొలి విడతలో 72,045 మందికి ఇళ్లను మంజూరు చేశారు. ఇప్పుడు గతంలో జాబితా ప్రకటించిన గ్రామాలను మినహాయించి ఆయా మండలాల్లోని తక్కిన పల్లెల్లో అర్హుల ఎంపికపై దృష్టి

తరువాయి 2లో



## మా చెల్లి అక్రమాలకు అమ్మ అండ

- వ్యవహారమంతా షర్మిల వెనకుండి నడిపిస్తున్నారు
- ఆమెపై ఒకప్పటి ప్రేమ, ఆప్యాయత ఇప్పుడు లేవు
- న్యాయం కోసమే ఈ పిటిషన్లు
- ఎన్‌సీఎల్‌టీకి నివేదించిన జగన్
- సరస్వతి పవర్‌లో వాటాల వివాదం

2లో

## ముఖ్యమంత్రికి ఓటర్లు కర్రు కాల్చి వాతపెట్టారు

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

ఎమ్మెల్సీల ఎన్నికపై విజయోత్సవాలు

2లో



## అమెరికాలో పెరిగిన తుపాను ఉద్ధృతి

అట్లాంటా: అమెరికాలోని పలు రాష్ట్రాల్లో తుపాను బీభత్సం కొనసాగుతోంది. దీని ధాటికి మిసిసిపిలో మృతుల సంఖ్య మూడుకు పెరిగింది. ఓక్లహామాలో పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా, ఫ్లోరిడా, వర్జీనియాల్లో అధికారులు

తరువాయి 2లో





## విజయవాడ, విశాఖపట్నం మెట్రోలకు 100% సాయం చేయాలి

- సాధ్యమైనంత త్వరగా ఈ ప్రాజెక్టులను ఆమోదించండి
- కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఖట్టర్‌కు సీఎం చంద్రబాబు వినతి

దిల్లీ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యనగరాలైన విశాఖపట్నం, విజయవాడల్లో మెట్రో రైలు ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం నుంచి 100% ఆర్థిక వనరులు సమకూర్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కోరారు. గురువారం వరుసగా రెండో రోజు దిల్లీ పర్యటనకు వచ్చిన

తరువాయి 2లో

## పైకి ఘుమఘుమలు.. వంటగదిలో బొద్దింకలు!

- అనేక రెస్టారెంట్లలో శుచీశుభ్రత లేని కిచెన్లు
- పరిసరాల్లో కీటకాలు, తుప్పు పట్టిన పాత్రలు

హైదరాబాద్: రెస్టారెంట్‌లోకి ప్రవేశించగానే వంటకాల ఘుమ ఘుమలు 'ఆహా ఏమి రుచి' అని పిస్తాయి.. ఆకర్షించే టేబుళ్లు, ఎటు చూసినా సర్వర్లు, చుట్టూ అందమైన పరిసరాలు.. ఈ హోటల్‌లో విందు

తరువాయి 2లో



# ఇందిరమ్మ ఇళ్లకు అర్హుల ఎంపిక షురూ

(మొదటిపేజీ తరువాయి)

సారించారు. రాష్ట్రంలో అందిన దరఖాస్తుల మేరకు ఇందిరమ్మ ఇళ్ల యాప్ ద్వారా గతంలోనే దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పూర్తి వివరాలు నమోదు చేశారు. దరఖాస్తుదారులను ఎల్ 1(సొంత స్థలాలు ఉన్నవారు), ఎల్ 2(సొంత స్థలం కాని, ఇల్లు కాని లేని వారు), ఎల్ 3(ఇతరులు) అని మూడు జాబితాలుగా విభజించారు. ఆ వివరాలు మండల పరిధిలో ఎంపీడీవో, పురపాలిక పరిధిలో కమిషనర్ల లాగిన్‌కు చేరాయి. ఇలా తొలి విడత పరిశీలన పూర్తవగా ఇప్పుడు ఎల్ 1 జాబితాను రీవెరిఫికేషన్ చేస్తున్నారు. ఈ జాబితాలో 21.93 లక్షల మంది దరఖాస్తుదారులు ఉన్నారు. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన 72 వేల మంది అర్హులను మినహాయించి మిగతా వారి ఇళ్లకు వెళ్లి రీవెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. ఇందులో అతి పేదలను గుర్తిస్తారు.

**ఒక్కో మండలానికి నాలుగైదు బృందాలు..**

రీవెరిఫికేషన్ కోసం ఒక్కో మండలానికి నాలుగైదు బృందాలను ఏర్పాటు చేశారు. ఎల్ 1 జాబితాలో ఉండాల్సిన తమ పేర్లను ఎల్ 2, ఎల్ 3లో చేర్చారని అధికారులకు ఫిర్యాదులు అందాయి. ఇలాంటి దరఖాస్తుదారుల వివరాలు సైతం ఎంపీడీవో, కమిషనర్ల లాగిన్‌కు వెళ్లాయి. మండలాల వారీగా ఏర్పాటు చేసిన బృందాలు ఈ ఫిర్యాదులపై కూడా రీవెరిఫికేషన్ చేస్తున్నాయి.

# సమయాన్ని సద్వినియోగం చేసుకోవడమే కీలకం

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యాత మన రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులన్నీ చెబుతున్నారు. ఆ లెక్కలు చెప్పకండి. పక్కనే నిర్మలా సీతారామన్ వింటారు. వీళ్లకు అన్నీ బాగున్నాయి.. ఇంక మన నిధులతో పని లేదనుకుంటారు' అని చమత్కరించారు. కేంద్ర సాయం తీసుకుని మన తక్షణ అవసరాలకు ప్రాధాన్యమిచ్చి, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్లాలని కోరారు. మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' పుస్తకం తెలుగు ప్రతిని ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి వెంకయ్యనాయుడు ఆవిష్కరించారు. ఆంగ్లప్రతిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఆవిష్కరించారు. గురువారం విశాఖలోని గీతం వర్సిటీలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'చంద్రబాబు మాతృభాషలో విద్యాబోధన జరగాలని సూచించడం చాలా సంతోషం. పదో తరగతి వరకు మాతృభాషలోనే బోధన సాగాలి. ప్రభుత్వ ఉత్తరప్రత్యుత్తరాలన్నీ తప్పనిసరిగా తెలుగులోనే ఉండాలి. ఇది అమలయ్యేలా చంద్రబాబు చొరవ తీసుకుంటారని భావిస్తున్నా' అని పేర్కొన్నారు. తమ అనుభవాల్ని తర్వాత తరానికి అందించాలన్న స్ఫూర్తిని అందిపుచ్చుకుని దగ్గుబాటి ఈ పుస్తకం రాయడం, ప్రపంచ చరిత్ర పరిణామక్రమాన్ని సరళమైన భాషలో సామాన్యులకు అర్థమయ్యేలా తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు.

*** సోషల్ మీడియా పరిణామాలు ఇప్పుడు అనుభవిస్తున్నారు**

'సోషల్ మీడియాను అదుపులో పెట్టకపోతే వచ్చే పరిణామాలేంటో ఆంధ్రప్రదేశ్‌లో చూశారు. ఏపీలో సోషల్ మీడియాను ఎలా వాడుకున్నారు? ఏం చేశారో చూశారు. దాని పరిణామాలు ఇప్పుడు కొంత మంది అనుభవిస్తున్నారు. 'మేం అనుకోలేదు.. ఆయన ఎవరో ఎక్కడ నుంచో చెబితే చేశాం' అంటున్నారు. అలా చెబితే చెయ్యడానికి మీకు బుద్ధి లేదా?'' అని వెంకయ్యనాయుడు పరోక్షంగా వైకాపా నాయకులకు చురకలు అంటించారు.

*** తెలుగుజాతి నంబర్‌వన్ కావాలన్నది నా కల**

ముఖ్యఅతిథిగా హాజరైన చంద్రబాబు మాట్లాడుతూ 'చరిత్ర సృష్టించే ఈ సమయంలో అశ్రద్ధ లేకుండా అందరం కష్టపడితే వికసిత్ భారత్, స్వర్ణాంధ్రప్రదేశ్ సాధ్యమవుతాయి. కష్టాలున్నాయని ఆత్మస్థైర్యం పోగొట్టుకోవడానికి నేను సిద్ధంగా లేను. వెంకయ్యనాయుడు నేను ఓవర్ కాన్ఫిడెంట్‌గా ఉన్నానన్నారు. నాకు ఆశ ఉంది. ప్రధాని మోదీ 2047 నాటికి దేశాన్ని ప్రపంచంలోనే మొదటి, రెండు స్థానాల్లో నిలిచే ఆర్థిక వ్యవస్థగా తయారు చేయాలనుకున్నప్పుడు అందులో నంబర్ వన్ స్థానంలో తెలుగు జాతి ఉండాలన్నది నా ఆకాంక్ష' అని పేర్కొన్నారు. దిల్లీలో ఆర్థిక మంత్రిని కలిసి కొన్ని సమస్యలు చెబితే విశాఖ వచ్చేలోగా నిధులు విడుదల చేసి సహకరించారని సీఎం చెప్పారు. వెంటిలేటర్‌పై ఉన్న ఏపీకి ఇంకొన్ని రోజులు మీ ట్రీట్‌మెంట్ అవసరమని నిర్మలా సీతారామన్‌ను కోరానన్నారు. 'ప్రతి ఒక్కరూ చరిత్ర గురించి తెలుసుకోవాలి. కొన్ని కోట్ల సంవత్సరాల మానవ పరిణామక్రమాన్ని, ప్రపంచ చరిత్రను తెలుగులో రచించిన నా తోడల్లుడు వెంకటేశ్వరరావుకు అభినందనలు. తపనతో లోతైన విశ్లేషణ చేస్తే తప్ప ఇది సాధ్యం కాదు' అన్నారు.

'1978లో నేను, వెంకయ్యనాయుడు ఇద్దరం ఎమ్మెల్యేలుగా అసెంబ్లీకి వెళ్లాం. అప్పటికీ ఇప్పటికీ ఆయన పవర్ ఎక్కడా తగ్గలేదు. అవసరమైతే పంచ్‌లు పేలుస్తున్నారు తప్ప తగ్గలేదు' అని ఆయన చమత్కరించారు. ఇటీవల ఎన్నికలప్పుడు పురందేశ్వరి చూపించిన చొరవ, నడిపించిన విధానం రాష్ట్ర ప్రజలకు మంచి జరగడానికి ఉపయోగపడిందని ఆయన గుర్తు చేశారు.

*** పుస్తకావిష్కరణ సభకు హాజరైన అతిథులు**

**350 పేజీల్లో చరిత్ర.. నిజంగా అద్భుతం**

సుదీర్ఘ కాలం రాజకీయాల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన దగ్గుబాటి వెంకటేశ్వరరావు పుస్తక రచన చేయడం అసాధారణ విషయమని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కొనియాడారు. 'చరిత్ర అనే సముద్రం లోతుకు వెళ్లి, బయటకు వచ్చి పుస్తకం రాశారు. ప్రపంచ చరిత్రను 350 పేజీల్లో రాయడం దగ్గుబాటి నైపుణ్యానికి కొలమానం. భారత చరిత్రను వక్రీకరించడానికి గతంలో అనేక ప్రయత్నాలు జరిగాయి. దేశంపై దండెత్తి, పాలించినవారు రాసిన చరిత్రే ఇప్పటికీ శాసిస్తుంది. జాతీయ విద్యా విధానంలో భాగంగా దేశచరిత్రలోని వాస్తవాలు బయటకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. ఈ పుస్తకాన్ని తెలుగులో రాయడమంటే మాతృభాషకు సేవ చేయడమే. ఇది ప్రపంచ చరిత్రకు ఎన్‌సైక్లోపీడియా వంటిది' అని నిర్మలాసీతారామన్ చెప్పారు. అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ప్రపంచచరిత్రలో జరిగే మార్పులపైనా వెంకటేశ్వరరావు అధ్యయనం చేయాలని ఆమె సూచించారు.

*** చరిత్ర తెలియాలనే తపనతోనే..**

'రాజకీయ నాయకుడు రాసిన పుస్తకానికి విలువ ఉంటుందా అని తొలుత భావించాను. చదివినవారు బాగుందని చెప్పాక ఉత్సాహం వచ్చింది' అని పుస్తక రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. '1983లో ఎమ్మెల్యేగా తొలిసారి శాసనసభలో అడుగుపెట్టాక.. చరిత్ర తెలియకుండా సభలో కూర్చోవడానికి నాకు అర్హత ఉందా అనే అనుమానమొచ్చింది. చరిత్ర పుస్తకాలు ఎన్నో కొని చదివేవాణ్ని. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలుగు ప్రజల పుట్టుపూర్వోత్తరాల గురించి తెలుసుకుని రాశాను. తర్వాత ప్రపంచ చరిత్ర గురించి రాయాలనిపించింది. దీనికి మరో వైద్యుడు సహకరించారు' అని వివరించారు. 35 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ఎవరూ వేలెత్తి చూపని, మచ్చలేని నాయకుడిగా వెంకటేశ్వరరావు ప్రజా జీవనంలో కొనసాగారని భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విశాఖ, విజయనగరం ఎంపీలు శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, ఎన్.ఈశ్వరరావు, భాజపా నాయకులు సోము వీర్రాజు, దినకర్, మాధవ్, పరశురామ్‌రాజు, కిమిడి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

యాదగిరిగుట్ట ఆలయానికి స్వయం ప్రతిపత్తి కల్పించేలా ప్రత్యేక ట్రస్ట్ బోర్డు ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. రెవెన్యూశాఖలో 10,954 గ్రామస్థాయి పరిపాలన అధికారు(జీపీవో)ల పోస్టులను మంత్రివర్గం ఆమోదించింది. 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ పోస్టులకు కూడా క్యాబినెట్ అనుమతించింది. సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం మంత్రివర్గం సమావేశమైంది. సుమారు 6 గంటల పాటు జరిగిన క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలను ఆమోదించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పొన్నం ప్రభాకర్ సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో క్యాబినెట్‌లో తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు.

**మంత్రివర్గ నిర్ణయాలు**

''ఎస్సీల వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును అమలు చేస్తామని సీఎం తెలిపారు. ఈ మేరకు జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో కమిషన్ నియమించగా.. ఫిబ్రవరి 3న నివేదిక ఇచ్చింది. ఈ నివేదికలోని సిఫార్సులను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చించాం. ఈ నివేదికను పునఃపరిశీలించాలని వివిధ వర్గాల నుంచి 71 విజ్ఞప్తులు వచ్చాయి. వాటిని పరిశీలించి సవరణ నివేదిక ఇవ్వాలని కమిషన్‌ను ప్రభుత్వం కోరింది. న్యాయపరమైన చిక్కులు లేకుండా చట్టం తీసుకువచ్చేందుకు.. సవరణ నివేదికను కమిషన్ ఇచ్చింది. దాన్ని బిల్లు రూపంలో అసెంబ్లీ ముందుకు తీసుకురానున్నాం. బీసీ కులగణన, రిజర్వేషన్ అంశాలపై మంత్రివర్గం చర్చించింది. బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ముసాయిదా బిల్లు మంత్రివర్గం ముందుకు వచ్చింది. విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థలకు వేర్వేరు బిల్లులు తీసుకువచ్చి.. తీర్మానం చేయాలని నిర్ణయించాం. గతంలో బీసీ రిజర్వేషన్లను 37 శాతానికి పెంచుతూ కేంద్రానికి పంపించిన తీర్మానాన్ని వెనక్కు తీసుకోనున్నాం. ఒక తీర్మానం పెండింగ్‌లో ఉన్నపుడు మరో తీర్మానం చేయడం కుదరనందువల్ల ఇందుకు నిర్ణయించాం. ప్రభుత్వం చెప్పినట్లు బలహీనవర్గాలకు 42% రిజర్వేషన్లు కల్పించేలా చట్టాన్ని తీసుకువచ్చి.. అమలు చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నం చేస్తుంది. రాష్ట్రాన్ని మూడు సెక్టార్లుగా విభజించాం. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని కోర్ ఏరియాగా.. ఔటర్ నుంచి ఆర్ఆర్ఆర్ బఫర్ వరకు తెలంగాణ అర్బన్‌గా.. ఆర్ఆర్ఆర్ బఫర్ అవతల ప్రాంతాన్ని నగరాలు, మున్సిపాలిటీలను మినహాయించి రూరల్‌గా విభజించాం. తెలంగాణ ఫ్యూచర్ సిటీపై సమావేశంలో చర్చించాం. ఏడు మండలాలు, 56 గ్రామాలతో ఎఫ్‌సీడీఏ ఏర్పాటు చేయనున్నాం. నాగార్జునసాగర్ హైవే నుంచి శ్రీశైలం హైవే వరకు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో దీన్ని నిర్మించాలని నిర్ణయించాం. ఫ్యూచర్ సిటీ పరిధిలోకి వచ్చే 36 గ్రామాలు గతంలో హెచ్ఎండీఏ పరిధిలో ఉండేవి. వాటిని అక్కడి నుంచి తొలగించి ఎఫ్‌సీడీఏకు బదిలీ చేశాం. ఫ్యూచర్ సిటీ కోసం 90 పోస్టులు మంజూరు చేశాం.

# అమెరికాలో పెరిగిన తుపాను ఉద్ధృతి

అట్లాంటా: అమెరికాలోని పలు రాష్ట్రాల్లో తుపాను బీభత్సం కొనసాగుతోంది. దీని ధాటికి మిసిసిపిలో మృతుల సంఖ్య మూడుకు పెరిగింది. ఓక్లహామాలో పలు చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. ఉత్తర కరోలినా, దక్షిణ కరోలినా, ఫ్లోరిడా, వర్జీనియాల్లో అధికారులు బుధవారం టోర్నడో హెచ్చరికలు జారీ చేశారు. ఉత్తర కరోలినాలో ఈఎఫ్1 టోర్నడో కారణంగా బలమైన గాలులు వీయడంతో పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. పలుచోట్ల విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. టెక్సాస్, ఓక్లహామా, లూసియానాల్లో ఇప్పటికే కనీసం 7 టోర్నడోలు విధ్వంసం సృష్టిస్తున్నాయని, వీటి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఫ్లోరిడా నుంచి న్యూయార్క్ వరకూ వీటి ప్రభావం ఉంటుందని పేర్కొన్నారు.





తీవ్రగాలుల ప్రభావంతో టెక్సాస్‌లోని శాన్ పాట్రిసియో కౌంటీలో సంభవించిన ఓ కార్చిచ్చు కారణంగా 20కుపైగా ఇళ్లు దహనమయ్యాయి. పసిఫిక్ ప్రాంతం నుంచి ముంచుకురాబోతున్న పెనుతుపాను కారణంగా శుక్రవారం వరకు భారీ వర్షాలు, హిమపాతం సంభవించనున్నట్లు అధికారులు వెల్లడించారు. నెబ్రాస్కాలోని తూర్పు ప్రాంతంలో బుధవారం 10.2 సెం.మీ. మేర మంచు కురిసింది. దీంతో పలు రహదారులను మూసివేశారు. మిన్నెసోటాలోని మిన్నెపొలిస్ విమానాశ్రయంలో 18.8 సెం.మీ. మేర హిమపాతం సంభవించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా బుధవారం టెక్సాస్‌లో సుమారు 51 వేల ఇళ్లు, వర్జీనియాలో 27 వేలు, టెన్నెసీలో 17 వేల ఇళ్లు, కార్యాలయాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పలు విమానాశ్రయాల నుంచి రాకపోకలు సాగించాల్సిన 800 విమానాలు రద్దయ్యాయి.

*** ఆస్ట్రేలియాలో ఆల్ఫ్రెడ్ ప్రభావం..**

బ్రిస్బేన్: ఆస్ట్రేలియాలోని తూర్పు ప్రాంతాన్ని గురువారం ఆల్ఫ్రెడ్ తుపాను ఉక్కిరిబిక్కిరి చేసింది. దీని కారణంగా భారీ వర్షాలు కురవడంతో ప్రజారవాణా వ్యవస్థ స్తంభించింది. వందల సంఖ్యలో పాఠశాలలను మూసివేశారు. క్వీన్స్‌లాండ్ రాజధాని బ్రిస్బేన్ నగరంపై ఈ తుపాను ప్రభావం తీవ్రంగా ఉండనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. న్యూ సౌత్‌వేల్స్‌లో 4,500 ఇళ్లకు విద్యుత్తు నిలిచిపోయింది.

# మా చెల్లి అక్రమాలకు అమ్మ అండ

హైదరాబాద్: తల్లి విజయమ్మను ముందు పెట్టుకుని తన పంతం నెగ్గించుకోవడానికి చెల్లి షర్మిల అక్రమ చర్యలకు పాల్పడుతున్నారని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జాతీయ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) హైదరాబాద్ బెంచ్‌కు నివేదించారు. సరస్వతి పవర్ వాటాల వివాదంలో తల్లి ఆవేదనను అర్థం చేసుకోగలమని, ఆమెపై గౌరవమని, అయితే చెల్లి వెనకుండి చేయిస్తున్న అక్రమాలను అడ్డుకోవడానికే ఈ పిటిషన్ వేశానని పేర్కొన్నారు. సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ రిజిస్టర్‌లో వాటాదారుల పేర్లను సవరించి, తమ వాటాలు పునరుద్ధరించాలంటూ జగన్, భారతిరెడ్డి, క్లాసిక్ రియాల్టీలు పిటిషన్ వేసిన విషయం విదితమే. ఇందులో విజయమ్మ దాఖలు చేసిన కౌంటరుతోపాటు సరస్వతి పవర్, డైరెక్టర్ చాగరి జనార్దన్‌రెడ్డి వేసిన కౌంటర్లు, తనను పిటిషన్‌ను నుంచి తొలగించాలంటూ షర్మిల దాఖలు చేసిన పిటిషన్లపై జగన్ సమాధానమిస్తూ అఫిడవిట్ సమర్పించారు. 'షర్మిల అత్యాశ వల్లే అక్రమంగా వాటాల బదలాయింపు జరిగింది. మొత్తం వ్యవహారాన్ని షర్మిల ప్రణాళిక ప్రకారం తల్లిని ముందుంచి నడిపించింది. వ్యక్తిగత, రాజకీయ విభేదాలతో తల్లి, ఇతరులను అడ్డుపెట్టుకుని వాటాలు బదలాయించడం వల్ల మాకు నష్టం వాటిల్లింది. హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున చెల్లితో పరిస్థితులు చేయి దాటిపోకుండా నేనూ, భారతీ అమ్మ ద్వారా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు' అని జగన్ పేర్కొన్నారు. 'షర్మిల ఏ కంపెనీలోనూ పెట్టుబడి పెట్టలేదు. నిర్వహణలో భాగస్వామి కాలేదు. ఏ నష్టాలకూ హామీ ఇవ్వలేదు. కంపెనీలపై నమోదైన కేసులను ఎదుర్కోలేదు. అయినా తల్లిని బలిపశువును చేసి, మా వాటాలు లాక్కోవడానికి ప్రయత్నిస్తోంది. కంపెనీ చట్టంలోని సెక్షన్ 59 కింద రిజిస్టర్‌లో పేర్లను మార్చినపుడు.. సరైన కారణముంటే జోక్యం చేసుకునే పరిధి ట్రైబ్యునల్‌కు ఉంది. ప్రతివాదులు ఈ పిటిషన్‌కు తప్పుడు భాష్యం చెబుతూ దీనిపై ట్రైబ్యునల్ విచారించకుండా, కుటుంబ వివాదంగా మార్చుతున్నార'ని జగన్ ఆక్షేపించారు.

**పథకం ప్రకారమే తప్పించాలన్న అభ్యర్థన**

పథకం ప్రకారమే షర్మిల ఈ పిటిషన్ నుంచి తప్పించాలని కోరుతున్నారని జగన్ పేర్కొన్నారు. చెల్లి ఒత్తిడితో గిఫ్ట్‌డీడ్‌లను అడ్డుపెట్టుకుని వాటాల అక్రమ బదలాయింపును తల్లి సమర్థించుకుంటున్నారన్నారు. 'గిఫ్ట్‌డీడ్ ప్రక్రియ పూర్తికాలేదు. వాటాల సర్టిఫికెట్లను మేమింకా అమ్మకు అందజేయలేదు. వాటాలు బదలాయించలేదు. అసంపూర్తి గిఫ్ట్‌డీడ్‌తో వాటాల బదలాయింపు పూర్తైనట్లు కాదు. చట్టప్రకారం బదలాయింపు జరిగితేనే, చెల్లుబాటు అవుతుంద'ని వివరించారు. హైకోర్టు ఉత్తర్వుల అమలులో భాగంగా ఎన్‌సీఎల్‌టీలో పిటిషన్ వేసినట్లు తెలిపారు. ప్రస్తుత కేసులో బోర్డు డైరెక్టర్లు అక్రమంగా వాటాల బదలాయింపును ఆమోదించారని, అయితే, బోర్డు సమావేశం సమాచారం తనకు తెలియదంటూ ఒక డైరెక్టర్ పేర్కొన్నారని ట్రైబ్యునల్ దృష్టికి తెచ్చారు. సరస్వతి పవర్‌లోని వాటాలను కోర్టు కేసులన్నీ పూర్తయ్యేదాకా అమ్మ వద్ద ఉంచామని, షర్మిల వల్లే విజయమ్మ ట్రైబ్యునల్‌ను తప్పుదోవ పట్టిస్తున్నారని జగన్ పేర్కొన్నారు. 'చెల్లితో ఉన్న వ్యక్తిగత, రాజకీయ విభేదాలతో ఈ పిటిషన్ వేశామనడం అవాస్తవం. క్లాసిక్ రియాల్టీలోని వాటాల బదలాయింపుతో సరస్వతి పవర్‌లో 48.99% వాటా ఉందన్నది వాస్తవమే. గిఫ్ట్‌డీడ్ ఇచ్చినంత మాత్రాన వాటాలు బదలాయించినట్లు కాదు, ఆ వాటాలపై పూర్తి హక్కులు దాతవే. చెల్లిపై ఉన్న ప్రేమ, వాత్సల్యంతో నా ఆస్తులను భవిష్యత్తులో ఆమెకు ఇవ్వాలనుకున్నా. అందుకే ముందస్తు తేదీలతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. 'ఈ కేసులన్నీ తేలాకే' అంటూ ఎంవోయూలో స్పష్టంగా ఉంది. అయినా, అలాంటి ఒప్పందమేదీ లేదని అమ్మ చెప్పడం అవాస్తవం. షర్మిల మోసపూరిత చర్యల వల్ల ఆ ఒప్పందమూ ఆగిపోయింది. తుదకు దాన్ని రద్దు చేసుకున్నట్లు గతంలోనే చెప్పిన విషయాన్ని ట్రైబ్యునల్ పరిగణించాల'ని కోరారు.

**అక్రమ బదలాయింపునకు షర్మిలే కారణం**

వాటాల అక్రమ బదలాయింపునకు కారణం షర్మిలేనని జగన్ పేర్కొన్నారు. 'గతంలో ఉన్న ప్రేమ, ఆప్యాయతలు ఆమె చేసిన మోసం, అక్రమ చర్యల వల్ల ఇప్పుడు లేవు. పాత తేదీలతో, సృష్టించిన పత్రాలతో, తప్పుడు అఫిడవిట్లతో మోసగించారు. నా ఆస్తిని లాక్కునేందుకు ప్రయత్నిస్తున్నార'ని ఆరోపించారు. 'కంపెనీలో వాటాదారు, డైరెక్టర్, నిర్వహణలో ఆమె పాత్ర ఉందని మేం చెప్పలేదు. మా మధ్య ఎంవోయూను షర్మిల ప్రస్తావించడం లేదు. ఇదే వివాదంపై షర్మిల నాకు లేఖలు రాసిన సంగతిని గుర్తించాలి. అమ్మ ద్వారా ప్రయోజనాలు ఆశిస్తున్న షర్మిల ఈ వివాదంతో తనకు సంబంధం లేదని చెబుతున్నారు. మరోవైపు గిఫ్ట్‌డీడ్, వాటాలపై అమ్మకున్న హక్కులపై భిన్నవాదనలు వినిపిస్తున్నారు. ఈ కేసుతో షర్మిలకు సంబంధముంది. ఆమె పిటిషన్‌ను తొలగించాలని కోరడం సరికాదు' అని వివరించారు.

# పైకి ఘుమఘుమలు.. వంటగదిలో బొద్దింకలు!

(మొదటిపేజీ తరువాయి)

భలే పసందు అనే వాతావరణం ఉంటుంది. కానీ, ఒక్కసారి సదరు హోటల్ వంటగదిలోకి అడుగు పెడితే మాత్రం ఎటుచూసినా బొద్దింకలు, తుప్పు పట్టిన పాత్రలు, ఈగలు, దోమలు వాలుతూ పరిసరాలు దర్శనమిస్తాయి. రాష్ట్రంలో అనేక రెస్టారెంట్లలోని వంట గదులు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. కిచెన్‌లో పాటించాల్సిన పరిశుభ్రతకు, నాణ్యతా ప్రమాణాలకు నిర్వాహకులు తిలోదకాలు ఇస్తున్నట్టు అధికారులు తనిఖీల్లో గుర్తిస్తున్నారు. చిన్న హోటళ్లలోనే కాదు, కొన్ని పెద్దపెద్ద రెస్టారెంట్లలోనూ ఇదే దుస్థితి.

**'లోనికి ప్రవేశం లేదు'**

హైదరాబాద్‌లో సుమారు 85 వేలకుపైగా ఆహారశాలలు ఉండగా అందులో 42 వేలకుపైగా పెద్ద రెస్టారెంట్లు, కేఫ్‌లు, టిఫిన్ సెంటర్ల లాంటివి ఉన్నాయి. ఇక రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో మరో 50 వేలకుపైగా రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు ఉంటాయని అంచనా. రెస్టారెంట్లలో రుచికరమైన ఆహారం వండడానికి ఎంత ప్రాధాన్యం ఇస్తారో, వంట గదుల శుభ్రతకూ అంతే ఇవ్వాలి. తగిన ప్రమాణాలు పాటించాలి. కానీ, చాలా చోట్ల వంట గదుల బయట 'లోనికి ప్రవేశం లేదు' అనే బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

# విజయవాడ, విశాఖపట్నం మెట్రోలకు 100% సాయం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ఇక్కడ కేంద్ర మంత్రిని కలిసి, వినతిపత్రం సమర్పించారు. రెండు ప్రాజెక్టుల ప్రాధాన్యం గురించి వివరించారు. ప్రధాన నగరాల్లో కాలుష్యం, ట్రాఫిక్ రద్దీ నియంత్రణ, ఆర్థిక వృద్ధి, రాష్ట్రంలో పట్టణ రవాణా సౌకర్యాల మెరుగుదలకు ఇవి రెండూ అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టులని చెప్పారు. అందువల్ల వీటికి సాధ్యమైనంత త్వరగా ఆమోదముద్ర వేసి, కేంద్ర మద్దతు అందించాలని కోరారు. రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌కు ఎదురవుతున్న ఆర్థిక సవాళ్లను దృష్టిలో ఉంచుకొని ఈ రెండు ప్రాజెక్టులకు కేంద్రం తప్పనిసరిగా 100% నిధులు సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. తొలిదశ ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను సకాలంలో పూర్తి చేసేందుకు అవసరమైన అనుమతులు కూడా ఇప్పించాలని కోరారు.

**అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతం విశాఖ**

హైదరాబాద్‌కు మెట్రోరైలు ప్రాజెక్టును రాష్ట్ర విభజనకు ముందే ఆమోదించినా, విజయవాడ, విశాఖపట్నం ప్రతిపాదనలను మాత్రం పెండింగ్‌లో ఉంచారని చంద్రబాబు గుర్తుచేశారు. 'ఆంధ్రప్రదేశ్‌కు ఇప్పుడు విశాఖపట్నం చాలా ముఖ్యమైన పారిశ్రామిక కేంద్రం. అక్కడ రోజురోజుకూ ట్రాఫిక్‌రద్దీ పెరుగుతోంది. 2026 జూన్‌కల్లా భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. అందువల్ల మెట్రోకారిడార్‌ను జాతీయ రహదారులతో అనుసంధానం చేయడం చాలా ముఖ్యం. తొలిదశలో నగరంలోని ప్రధాన కూడళ్లను కలుపుతూ ఎయిర్‌పోర్టు వరకు విస్తరించాలని ప్రణాళిక రూపొందించాం. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రాజధాని అమరావతికి విజయవాడ గేట్‌వే కానుందని, అందువల్ల ఇక్కడి మెట్రోరైలు ప్రాజెక్టుకూ ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రాంతీయ అనుసంధానాన్ని బలోపేతం చేయడానికి, ఈ ప్రాంత ఆర్థిక వృద్ధికి విజయవాడ మెట్రో చాలా ముఖ్యం.

# పరమశివుని కృపతో ఆలయ నిర్మాణ పనులను త్వరగా పూర్తి కావాలి

* **వి.ఎన్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు**



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : పరమశివుని కృపతో ఆలయ నిర్మాణ పనుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరగా పూర్తి కావాలని వి.ఎన్.ఆర్ ట్రస్ట్ చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు అన్నారు. కూకట్ పల్లి వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవస్థాన ప్రాంగణమునందు నూతనంగా శ్రీ కాశీ విశ్వనాథ సహిత అన్నపూర్ణేశ్వరి దేవాలయ నిర్మాణం పనులు ప్రారంభం సందర్భంగా గురువారం (వి.ఎన్.ఆర్ ట్రస్ట్) చైర్మన్ వడ్డేపల్లి రాజేశ్వరరావు , యామిని దంపతుల కరకమలములచే భూమి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరం శివరాత్రి వరకు శ్రీ కాశీ విశ్వనాథ , అన్నపూర్ణేశ్వరి దేవతల దర్శన భాగ్యం భక్తులకు కలగాలన్నారు. మనస్ఫూర్తిగా శివపార్వతులను వేడుకొని దృడ సంకల్పం చేసుకున్నారు.ఈ కార్యక్రమంలో అయినేని సుదర్శన్ రావు, నాయినేని సూర్యారావు, కుర్మయ్యగారి సుదర్శన్ రావు, వడ్డేపల్లి భూపతి రావు, వడ్డేపల్లి మురళీధర్ రావు, గొట్టిముక్కుల భాస్కర్ రావు, భగవాన్, కిషోర్, కాలనీవాసులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై పోలీసుల దాడులు

* **9 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్**
* **నగదు, ఒక కారు, ఒక ఆటో, నాలుగు బైక్‌లు సీజ్**



ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలోని రామలక్ష్మణపల్లి గ్రామ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. రామలక్ష్మణపల్లి శివారులో పేకాట ఆడుతున్నారనే పక్కా సమాచారం మేరకు ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్. గణేష్ తన సిబ్బందితో ఈ దాడులు చేపట్టారు. ఈ దాడుల్లో 9 మంది పేకాట రాయుళ్లను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 13,340 రూపాయల నగదు, ఒక కారు, ఒక ఆటో, నాలుగు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసినట్లు, వారిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమ దందాలు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్సై గణేష్ తెలిపారు. ఎస్సైతో కానిస్టేబుల్ కుమార్, సంతోష్ ,కాసిం , శ్రీనివాస్ ఉన్నారు.

# బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా గురుమంచి అశోక్ చారి..



ప్రజాస్ఫూర్తి, కాప్రా : కుషాయిగూడ ఆర్టీసీ డిపో బీసీ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా గురుమంచి అశోక్ చారి ఎన్నికయ్యారు. గురువారం జి ఆర్ ఎస్ ఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో జరిగిన కుషాయిగూడ డిపో బీసీ సంక్షేమ సంఘం సమావేశంలో కుషాయిగూడ కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గురుమంచి అశోక్ చారిని గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అశోక్ చారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అశోక్ చారి మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధంగా రావలసిన హక్కులను దక్కించుకోలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకపై పాలకులను యాచించకుండా రాజకీయాలను శాసించే విధంగా బీసీలలో చైతన్యం తీసుకు రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు చీర ఉపేందర్ కార్యదర్శి తోడేటి శ్రీనివాస్ కోశాధికారి మచ్చ బాబు గౌడ్, సహాయ కార్యదర్శులు శ్రీశైలం, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో ట్రాన్స్ కో ఏడీ శ్యామ్ ప్రసాద్

- **సోలార్ విద్యుత్ ప్లాంటును సింక్రనైజ్ నెట్ మీటరు అమర్చేందుకు రూ.70వేలు లంచం డిమాండ్**
- **కాంట్రాక్టర్ ఏసీబీని సంప్రదించడంతో రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న అధికారులు**
- **కొత్తపేట నివాసంలో కొనసాగుతున్న ఏసీబీ సోదాలు**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: సోలార్ విద్యుత్ ప్లాంటును సింక్రనైజ్ చేసే నెట్ మీటరు అమర్చేందుకు రూ.70వేలు లంచం తీసుకుంటున్న ట్రాన్స్ కో ఏడి శ్యామ్ ప్రసాద్ ను ఏసీబీ అధికారులు వల వేసి రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం తంగడపల్లి రెవెన్యూ పరిధిలోని అక్రిట్ పరిశ్రమ యాజమాన్యం తమ పరిశ్రమలో సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకుంది. సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటును ఓ సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించారు. సోలార్ విద్యుత్ ప్లాంట్ పూర్తి ఏర్పాటు జరిగి, విద్యుత్ సరఫరా జరిగితేనే సంబంధిత పరిశ్రమ కాంట్రాక్టర్ కు బిల్లులు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. ఈ సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేసిన సదరు కాంట్రాక్ట్ సంస్థ సోలార్ నుంచి ఉత్పత్తి అవుతున్న విద్యుత్తును పరిశ్రమలోని విద్యుత్ లైనుకు అనుసంధానం చేయడానికి కొత్త విద్యుత్తు మీటరు ఏర్పాటు చేస్తే పని మొత్తం పూర్తవుతుంది. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ అనుసంధాన మీటర్ కు అనుమతులు మంజూరు చేసే పూర్తి బాధ్యత ట్రాన్స్ కో డీఈ కి మాత్రమే ఉంటుంది. కానీ చౌటుప్పల్ పరిధిలోనే విద్యుత్ ఏడీ కార్యాలయం ఉండడంతో ఏడీ శ్యాం ప్రసాద్ ను సంప్రదించారు. ఏడీ శ్యాం ప్రసాద్ తన పరిధి కాదని తెలిసినా, అనుసంధాన మీటర్ ను ఏర్పాటు చేస్తానని, అదేవిధంగా డీఈ తో సైతం మాట్లాడి పనులు చేయిస్తానని, అందుకుగాను సదరు కాంట్రాక్టర్ వద్ద రూ.70వేల లంచం డిమాండ్ చేశారు. నాటి నుంచి ఏడీ కార్యాలయం చుట్టూ సదరు కాంట్రాక్టర్ తిరుగుతూనే ఉన్నాడు. కానీ సోలార్ విద్యుత్ ప్లాంటును సింక్రనైజ్ నెట్ మీటరు అమర్చే ప్రక్రియ ముందుకు జరగడం లేదు. దాదాపు మూడు నెలలు గడిచిపోయింది. రూ.70వేలు ఇస్తేనే పనులు ముందుకు సాగుతాయని అర్థం కావడంతో, విసుగు చెందిన సదరు కాంట్రాక్టర్ ఈ నెల 4వ తేదీన ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం చౌటుప్పల్ లోని ఓ రహస్య ప్రదేశంలో కాంట్రాక్టర్ నుంచి రూ.70వేలను తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. ట్రాన్స్ కో ఏడీ శ్యాంప్రసాద్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఏడీ శ్యాం ప్రసాద్ నుంచి లంచం డబ్బులు రూ.70వేలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏసీబీ అధికారులు అతన్ని హైదరాబాద్ నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు పర్చనున్నట్టు తెలిపారు. అదేవిధంగా హైదరాబాద్ కొత్తపేటలో ఉన్న విద్యుత్ ఏడీ శ్యాం ప్రసాద్ నివాసం వద్ద ఏసీబీ సిఐలు రఘునందన్, వెంకటేష్ ల ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నట్టు సమాచారం. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064టోల్ ఫ్రీ నెంబర్ కు ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు తెలిపారు. ఈ దాడుల్లో ఏసీబీ డీఎస్పీ జగదీష్ చందర్, సిఐలు రామారావు, వెంకట్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

# గౌడన్నల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలు

: **పల్లె సంతోష్ గౌడ్**




రాజాపేట, ప్రజా స్ఫూర్తి : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడుస్తున్నప్పటికీ ఎన్నికల ముందు గౌడన్నలకి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా రాష్ట్రంలోని అత్యంత బలమైన సామాజిక వర్గంగా పేరు పొందిన గౌడన్నల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా చర్యలు చేపడుతున్నారని రాజపేట టిఆర్ఎస్ పార్టీ మండల యువజన అధ్యక్షులు పల్లె సంతోష్ గౌడ్ విమర్శించారు. గురువారం ఆయన రాజపేటలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో గౌడన్నల ఆత్మ గౌరవాన్ని నిలబెట్టేలా కెసిఆర్ ప్రభుత్వం హైదరాబాద్ నడి బొడ్డున నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ ను ప్రారంభిగా రేవంత్ రెడ్డి సర్కార్ నీరా కేఫ్ తరలించి టాడి కార్పొరేషన్ లో విలీనం చేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. హైదరాబాదులోని కోకాపేటలో గత ప్రభుత్వం గౌడ భవనం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తే ఇప్పటివరకు ఈ ప్రభుత్వం భవన నిర్మాణానికి చర్యలు తీసుకోలేదని, యాదాద్రి భువనగిరి జిల్లా నందనంలో దాదాపు 7 కోట్ల రూపాయలతో నిర్మించిన నీరా కేంద్రం ప్రారంభానికి నోచుకోలేదని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గౌడన్నల్లకిచ్చిన హామీల్లో భాగంగా జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేస్తామని హైదరాబాదులోని ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పుతామని చెప్పి మాట నిలబెట్టుకోలేదన్నారు. గౌడన్నలకు చెల్లించే ఎక్స్గ్రేషియా ఐదు లక్షల నుంచి పది లక్షల వరకు పెంచుతామన్న హామీని తుంగలో తొక్కి 14 నెలల్లో గాయాల పాలైన ఒక్క గౌడన్న కి కూడా ఎక్స్గ్రేషియా చెల్లించని ఘనత ఈ ప్రభుత్వాన్నిదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీలోని గౌడ నాయకులు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, బీసీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ లు ముఖ్యమంత్రి దగ్గర గౌడ సామాజిక వర్గ గౌరవాన్ని తాకట్టుపెట్టి వారి పదవులు కాపాడుకోవడం కోసమే ప్రయత్నిస్తున్నారని ఎద్దేవ చేసారు. ఇకనైనా ప్రభుత్వం గౌడ సామాజిక వర్గం పై చిన్న చూపు మానేసి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రంలోని గౌడ జాతి ఎదురు తిరిగే రోజు వస్తుందని పల్లె సంతోష్ గౌడ్ హెచ్చరించారు.

# మార్చి 8న ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్ విందు




హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా మార్చ్ 8న ఆప్ రాష్ట్ర కార్యాలయంలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని ఆప్ మైనారిటీ విభాగం రాష్ట్ర నాయకులూ ఆఫ్జాల్ సలీం తెలిపారు. లిబర్టీ లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేఖరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ముస్లిం సోదరులంతా ఉపవాసాలు చేసేవారితోపాటు కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాలవారు పాల్గొనటానికి ఈ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో మతతత్వ విద్వేషపూరిత చర్యలు సర్వసాధారణం అవుతున్న ఇలాంటి సమయంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ శాఖ ఇఫ్తార్ విందు నిర్వహించడం ఆదర్శప్రాయమైన ఉదాహరణ అని అభివర్ణించారు. మత సామరస్యాన్ని బలోపేతం చేయడంలో చాలా దోహదపడే గొప్ప ఇఫ్తార్ విందు లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో ఆప్ మహిళా విభాగం నాయకురాలు నర్సింగ్ యమునా గౌడ్, డాక్టర్స్ విభాగం నాయకురాలు లక్ష్య నాయుడు, మైనారిటీ విభాగం నాయకులూ అజీమ్ బేగ్, షాబాజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి నియోజకవర్గం ఐ. యన్.టి.యు.సి అధ్యక్షులు గా కర్క నాగరాజు



కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి ) : కూకట్ పల్లి నియోజకవర్గం ఐ. యన్. టి.యు.సి అధ్యక్షులు గా మూసాపేట్ కు చెందిన కర్క నాగరాజు నియమితులయ్యారు. ఈ నియామక పత్రాన్ని గురువారం కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ కర్క నాగరాజు కి అందజేశారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కార్మికులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. నియోజకవర్గం లో కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అన్నారు. పి.జె.ఆర్ ను ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్తున్న యువ కార్మిక నాయకులు కర్కనాగరాజు కి పార్టీ తరపున, నా తరపున సహాయ సహకారాలు అందిస్తానన్నారు. కర్క నాగరాజు మాట్లాడుతూ నా పై నమ్మకం తో ఐ.యన్.టి.యు.సి కూకట్ పల్లి నియోజకవర్గం అధ్యక్షులు గా నియమించిన బండి రమేష్ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. నియోజకవర్గం లో కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికై తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గం లో ఐ.యన్.టి.యు.సి ని బలోపేతం చేస్తూ అందరి సహకారం తో ప్రభుత్వ పథకాలను ప్రజలకు, కార్మికులకు అందె విదంగా కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమం లో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కర్క పెంటయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్పరెడ్డి,వైస్ చైర్మన్ ప్రకాష్, మాదిరెడ్డి యుగేందర్ రెడ్డి,సుధాకర్ రెడ్డి,అనిల్, అరుణ్ కుమార్, అజాజ్ , బాలరాజు, హమీద్, అశోక్, హెచ్.ఏ.ఎల్ యూనియన్ నాయకులు సిబ్గ తుల్లాహ్, శ్రీకాంత్, వెంకటపతి,అబ్దుల్ షకూర్, కృష్ణా, నాగార్జున, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సుజాతనగర్లో జూనియర్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్

* **ఫలించిన ఎమ్మెల్యే కూనంనేని కృషి**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ పడింది. పదో తరగతి విద్య అనంతరం మండలంలోని పేద, మధ్యతరగతి విద్యార్థులు సుదూరంలోని కొత్తగూడెం, పరిసర ప్రాంతాల్లోని జూనియర్ కళాశాల్లో చేరి ఇబ్బందులు పడే పరిస్థితులు, ఆర్థికంగా నష్టపోతుండటంతో స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు మండలంలో జూనియర్ కళాశాల ఏర్పాటు కృషిని ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్య మంత్రి, సంబంధిత మంత్రులు, ఇంటర్మీడియట్ విద్య అధికారులను సంప్రదించి వత్తిడి తేవడంతో కళాశాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఇటీవల కళాశాల ఏర్పాటు ప్రక్రియ ప్రారంభించాలని ఇంటర్మీడియేట్ విద్య డైరెక్టర్ నుంచి ఉన్నత విద్య ప్రిన్సిపాల్ సెక్రటరీ లేక రాశారు. దేంతో ఎమ్మెల్యే కూనంనేని కృషి ఫలించినట్లైంది. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం, ఇంటర్మీడియట్ విద్యాశాఖ సుముఖత వ్యక్తం చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# రాజపేటలో బిజెపి శ్రేణుల సంబరాలు




రాజాపేట, ప్రజా స్ఫూర్తి : కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బిజెపి అభ్యర్థులు విజయం సాధించిన సందర్భంగా గురువారం రాజపేట మండల కేంద్రంలో రాజపేట మండల శాఖ ఆధ్వర్యంలో బాణాసంచా పేల్చి స్విట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కనుమరుగైతే, ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భూస్థాపితం అయిందన్నారు. కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని రాబోయే రోజులు పూర్తిగా భారతీయ జనతా పార్టీవే అని రాష్ట్రంలో బీఆర్ఎస్ కి కానీ కాంగ్రెస్ కు కానీ ఇక స్థానం లేదని ఇక పూర్తిగా భారతీయ జనతా పార్టీని స్థానిక సంస్థలు రాబోయే అసెంబ్లీ ఎలక్షన్లు కూడా పూర్తిగా ఏకాదిపత్యంగా విజయం సాధిస్తుందని మాట్లాడరు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాండ్ల నరసింగరావు, కుమ్మరి లక్ష్మణ్, కిసాన్ మోర్చా అధ్యక్షులు భగవాన్ రెడ్డి, బూరుగు శేఖర్ రెడ్డి, , ఐరేణి శ్రీధర్, గవ్వల సిద్ధేశ్వర్, జెన్నె సిద్ధులు, మాయకోటి రాజు, కాకళ్ళ నవీన్ , పోచయ్య, కొన్నే విజయ్ , చిన్నం వేణు, రంగ నరేష్, సంగెం వేణు, పెంట నాగరాజు, పుల్లయ్య, సోమాసాని చంద్ర మౌళి, డొంకెన సంపత్, వడిగంటి నాగరాజు మునిగంటి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



## కౌలుకు తీసుకున్నాం

## పంట పొలం ఎండిపోవడంతో రూ. 3 లక్షలు నష్టం

*** పరిస్థితి చూసైనా వెంటనే సాగునీరు అందించాలన్న జేఎసి**

రాజపేట, ప్రజా స్ఫూర్తి : కౌలుకు తీసుకొని సేద్యం చేసిన ఎనిమిది ఎకరాల వరి పంట నీరు లేకపోవడంతో కళ్ళ ముందే ఎండిపోయి మూడు లక్షల రూపాయల పెట్టుబడి నష్టం కలిగించిందని, పశువుల మేతగా మారిందని బాధిత రైతు జక్కుల శ్రీకాంత్ అన్నారు. గురువారం తన ఆవేదనను సోషల్ మీడియా ద్వారా వివరించారు. అంకతి బాలయ్య అనే రైతు వద్ద 8 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకొని వరిపడ్డ సేద్యం చేయగా రెండున్నర లక్షల రూపాయల పెట్టుబడి పెట్టినట్లు భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటి పోతుండడంతో కళ్ళముందే వేగంగా 8 ఎకరాల వరి పంట ఎండిపోయిందన్నారు. ఈ విషయంపై జలసాధన సమితి మండల కన్వీనర్ ఎర్రగోకుల జస్వంత్, టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సట్టు తిరుమలేష్, జేఏసీ సభ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ ఎన్నికల ముందు తర్వాత ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని, ఇప్పటికైనా పరిస్థితిని అర్థం చేసుకొని వెంటనే 15వ, ప్యాకేజీ ద్వారా గొలుసుకట్టులు చెరువులు నింపాలన్ని డిమాండ్ చేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలి

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పకడ్బందీగా పరిశీలించాలని అధికారులను జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్ ఆదేశించారు. గురువారం ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన, పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు, ధరణి పెండింగ్ దరఖాస్తులపైన అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన తో కలసి జెడ్పి సీఈవో నాగలక్ష్మి, పిడి హౌసింగ్ శంకర్, ఆర్డీవో, తాసిల్దారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు , ఎంపీవోలో తో టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల కోసం వచ్చిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించాలని, వచ్చిన దరఖాస్తులను మూడు జాబితాలుగా ఎల్ 1 ,ఎల్ 2 , ఎల్ 3 గా విభజించాలని ఆదేశించారు. పేదల్లో అత్యంత పేదలకు, దివ్యాంగులు , ఏ ఆధారం లేని వారికే ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన వివరాలను ప్రతిరోజు నివేదిక అందించాలని అధికారులను ఆదేశించారు.పెండింగ్ ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ఎల్ఆర్ఎస్కు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే నేరుగా క్రమబద్ధీకరణ ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సూచించారు . మార్చి 31లోగా రిజిస్ట్రేషన్లను పూర్తి చేసుకున్న వారికి ఎల్ఆర్ఎస్ ఫీజులో రాయితీ వర్తిస్తుందని అయన అన్నారు. ప్రజల ప్రయోజనాలని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. తక్కువ సంఖ్యలో పెండింగ్లో ఉన్న దరఖాస్తులు రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ధరణి మాడ్యూల్ లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం పై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వివిధ స్థాయిల్లో పెండింగ్లో ఉన్న దరఖాస్తులను సత్వరమై పూర్తి చేయాలని అధికారంలో ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. వారం రోజుల్లో ధరణి మాడ్యూల్లో పెండింగ్ దరఖాస్తులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## సాయం సంధ్య వేళ.. అరుణ వర్ణం..

**సాయం సంధ్య వేళ.. అరుణ వర్ణ శోభితం.. కనువిందు చేసిన దృశ్యం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు నియోజవర్గం టేకులపల్లి మండలం రోళ్ళపాడు లో గురువారం సాయం సంధ్య వేళ.. సూర్యుడు అస్తమించే సమయంలో చెరువు అంత ఎరుపెక్కి కనువిందు చేస్తున్న దృశ్యాలను ప్రజాస్ఫూర్తి కెమెరా క్లిక్ మనిపించిన దృశ్యం..**

**: ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:**



## విద్యార్థులకు వాటర్ బాటిల్ పంపిణి

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్ : ముస్తాబాద్ మండలంలోని పోతుగల్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న విద్యార్థులకు కీర్తిశేషులు వరి చంద్రమోహన్ జయంతి సందర్భంగా కుటుంబ సభ్యులు 40 వాటర్ బాటిల్ లను గురువారం విద్యార్థులకు అందజేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు వారి చంద్రమోహన్ జ్ఞాపకార్థంగా వాటర్ బాటిల్స్ ను అందజేయడం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థులకు వాటర్ బాటిల్స్ అందజేసిన కుటుంబ సభ్యులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురభి రాధా కిషన్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరి వెంకటేష్, వరి వికాస్, కోల కృష్ణ, కస్తూరి కార్తీక్, మీస సంజీవ్, ఏదునూరు గోపికృష్ణ, మహేష్ తదితరున్నారు.

## టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను కలిసిన జిట్ట సునీల్ కుమార్ యాదవ్



హైదరాబాద్, ప్రజాస్ఫూర్తి : నగరంలోని గాంధీభవన్ లో గురువారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో తెలంగాణ పిసిసి అధ్యక్షులు , ఎంఎల్సీ మహేష్ కుమార్ గౌడ్ నీ యువజన కాంగ్రెస్ నాయకులు జవహర్ బాల్ మంచ్ స్టేట్ కోఆర్డినేటర్ జిట్ట సునీల్ కుమార్ యాదవ్. మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 20 సంవత్సరాలుగా ఎన్ ఎస్ యు ఐ లో విద్యార్థి దశ నుంచి యువజన కాంగ్రెస్ లో పార్టీకి విధేయుడుగా ఉంటూ పార్టీ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించడం జరిగిందన్నారు. తనకు రాబోయే రోజుల్లో నామినేటెడ్ పదవి ఇవ్వాల్సిందిగా కోరారు. అనంతరం తన రాజకీయ బయోడేటా ను అందించారు.

# ఆ రెండు పార్టీలు కలిసి కాంగ్రెస్‌ను ఓడించాయి

**: మంత్రి పొన్నం**



హైదరాబాద్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా, భారాస రెండూ కలిసే కాంగ్రెస్‌ను ఓడించాయని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. ఎమ్మెల్సీ ఫలితాలపై ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. "అభ్యర్థిని పెట్టకుండా భాజపాతో కలిసి భారాస కుమ్మక్కయ్యింది. కేటీఆర్, హరీశ్‌రావు నియోజకవర్గాల్లో ఎన్నికలు జరిగాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వారిద్దరు ఎవరికి ఓటేశారో చెప్పాలి. తక్కువ ఓట్లతోనే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడిపోయాం. ఈ ఓటమిపై సమీక్షించుకుంటాం''అని అన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ను ఓడించ డానికి భాజపా, భారాస కలిసి పనిచేశాయన్నారు. పట్టభద్రులకు నైపుణ్యాన్ని పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేస్తున్నారని తెలిపారు.



## జానారెడ్డి నివాసానికి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్: కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జానారెడ్డి నివాసానికి సీఎం రేవంత్‌రెడ్డి వెళ్లారు. అరగంటకు పైగా వీరిద్దరి మధ్య చర్చ జరిగింది. ఎమ్మెల్సీ ఫలితాలు, క్యాబినెట్ సమావేశం నేపథ్యంలో వీరి భేటీకి ప్రాధాన్యం సంతరించుకుంది. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డిని వరంగల్-ఖమ్మం-నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా ఎన్నికైన శ్రీపాల్‌రెడ్డి కలిశారు.**

# నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు.. 60 మంది అరెస్టు



హైదరాబాద్: నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసగిస్తున్న ముఠాను సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్టు చేశారు. గుజరాత్‌కు చెందిన మనస్విని సహా 60 మందిని అరెస్టు చేశారు. కేసు వివరాలను పోలీసు అధికారులు వెల్లడించారు. వారి కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని హైటెక్ సిటీలో 'ఎక్సిటో సొల్యూషన్స్' పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ అనే వ్యక్తులతో కలిసి దీన్ని నిర్వహిస్తోంది. పలువురు ఈశాన్య రాష్ట్రాల వ్యక్తులను ఆమె టెలీకాలర్లుగా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు. వీరి నుంచి పోలీసులు 63 ల్యాప్‌టాప్‌లు, 52 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హ్యాక్ అయిన బ్యాంకు ఖాతాలు సరిచేస్తామంటూ వీరు మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతా, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నారు.

## పాతబస్తీ బహదూర్‌పురాలో భారీ అగ్ని ప్రమాదం



హైదరాబాద్: పాతబస్తీలోని బహదూర్‌పురాలో గురువారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. లారీ మెకానిక్ వర్క్‌షాప్‌లో చెలరేగిన మంటలు సమీపంలోని చెట్లకు వ్యాపించాయి. దీంతో స్థానికుల తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో విద్యుత్ సరఫరాను అధికారులు నిలిపివేశారు. ఘటనకు గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. గతంలో కూడా ఇదే మెకానిక్ వర్క్‌షాప్‌లో అగ్ని ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

# కరీంనగర్‌లో ప్రేమజంట ఆత్మహత్య



చొప్పదండి:కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలానికి చెందిన ఇద్దరు ప్రేమికులు ఆత్మహత్య చేసుకున్న ఘటన రెండు గ్రామాల్లో విషాదం నింపింది. వివరాల్లోకి వెళితే చొప్పదండి మండలం చిత్యలపల్లికి చెందిన కొండపర్తి అరుణ్ కుమార్ (24) కరీంనగర్‌లో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. అదే మండలం భూపాలపట్నానికి చెందిన నాంపల్లి అలేఖ్య(21)తో స్నేహం ఏర్పడి అది ప్రేమగా మారింది. రెండేళ్లుగా వీరు ప్రేమించుకుంటున్నారు. ఈ క్రమంలో అలేఖ్యకు వేరే వ్యక్తితో వివాహం కోసం సంబంధాలు చూస్తున్నారు. తమ వివాహం జరగదని భావించిన ఇరువురూ కరీంనగర్‌లో మిత్రుని ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.

# ఎస్ఎల్‌బీసీలో చిక్కుకున్న వారిని గుర్తించేందుకు కేరళ నుండి రెండు జాగిలాలు

* కేరళ నుండి ఆర్మీ హెలికాప్టర్లతో రెండు జాగిలాలను తీసుకొచ్చిన అధికారులు
* ఎనిమిది మంది చిక్కుకున్న ప్రాంతాలపై ప్రాథమిక అంచనాలు వేస్తున్న అధికారులు
* బురద, మట్టిని తొలగించేందుకు రంగంలోకి వాటర్ జెట్‌లు

ఎస్ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకు పోయిన ఎనిమిది మంది ఆచూకీని కనుగొనేందుకు కేరళ నుంచి ఆర్మీ హెలికాప్టర్ల ద్వారా రెండు క్యాడవర్ జాగిలాలను రప్పించారు. కేరళ ప్రత్యేక పోలీసు బృందం, జిల్లా కలెక్టర్ సంతోష్, విపత్తు నిర్వహణ అధికారులతో సమావేశమైంది. ఎనిమిది మంది ఉన్న ప్రాంతాలపై ప్రాథమిక అంచనాలు వేస్తున్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగంలో



బురద, మట్టి పేరుకుపోవడంతో పరిస్థితులు క్లిష్టంగా మారాయి. వాటిని తొలగించేందుకు అధికారులు వాటర్ జెట్‌లను ఉపయోగిస్తున్నారు. సొరంగంలో ఎనిమిది మంది చిక్కుకొని పదమూడు రోజులు అవుతోంది. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి, ర్యాట్ హోల్ మైన్స్, హైడ్రా తదితర సంస్థలకు చెందిన నిపుణులు బురద తొలగింపు పనుల్లో నిమగ్నమయ్యారు.

## జెలెన్ స్కీ స్వస్థలంపై రష్యా క్షిపణి దాడి

* క్రీవి రీహ్ లో జన్మించిన జెలెన్ స్కీ
* క్రీవి రీహ్ లోని ఓ హోటల్ పై రష్యా క్షిపణి దాడి
* నలుగురు మృతి... 30 మందికి గాయాలు



ఓవైపు ఉక్రెయిన్‌రష్యా మధ్య జరుగుతున్న యుద్ధాన్ని ఆపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ తరుణంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ స్వస్థలంపై క్షిపణి దాడి జరిగింది. క్రీవి రీహ్ లో జెలెన్ స్కీ జన్మించారు. క్రీవి రీహ్ లోని ఓ హోటల్ పై రష్యా క్షిపణితో దాడి చేసింది. ఈ దాడిలో నలుగురు మృతి చెందారు. మరో 30 మంది గాయపడగా... వీరిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఉక్రెయిన్ కు అమెరికా మద్దతుగా ఉంది. అయితే, ట్రంప్ అధ్యక్ష బాధ్యతలను స్వీకరించిన తర్వాత ఆ దేశం పట్ల కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఉక్రెయిన్ కు మిలిటరీ, ఇంటెలిజెన్స్ సాయాన్ని నిలిపివేశారు. ఈ తరుణంలో జెలెన్స్ స్కీ స్వస్థలంపై క్షిపణి దాడి జరగడం గమనార్హం.

## నరేంద్ర మోదీ, డొనాల్డ్ ట్రంప్‌లపై ప్రకాశ్ కారత్ తీవ్ర విమర్శలు

* మోదీ ప్రభుత్వాన్ని నియో ఫాసిస్ట్ ప్రభుత్వంగా అభివర్ణించిన ప్రకాశ్ కారత్
* ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వెల్లడించేందుకు ఈ పదాన్ని మొదటిసారి వాడినట్లు వెల్లడి
* ప్రతి దేశంలోనూ ఫాసిస్టు శక్తులు ఉంటాయన్న ప్రకాశ్ కారత్

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై సీపీఎం నేత ప్రకాశ్ కారత్ తీవ్ర విమర్శలు చేశారు. సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశాలు ఈ రోజు కేరళలోని కొల్లాంలో ప్రారంభమయ్యాయి. తన ప్రారంభోపన్యాసంలో ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని నియో ఫాసిస్ట్ ప్రభుత్వంగా



అభివర్ణించారు. పార్టీ రూపొందించిన రాజకీయ తీర్మాన ముసాయిదాలో ఎన్డీయే ప్రభుత్వాన్ని నియో ఫాసిస్ట్ ప్రభుత్వమని పేర్కొన్నట్లు చెప్పారు. ప్రస్తుతం మోదీ ప్రభుత్వం ఫాసిస్ట్ కాదని, నియో ఫాసిస్ట్ విధానాలతో ముందుకు సాగుతోందని ధ్వజమెత్తారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితిని వెల్లడించేందుకు తాను మొదటిసారి నియో ఫాసిస్ట్ పదాన్ని వాడినట్లు చెప్పారు. ప్రతి దేశంలోనూ ఫాసిస్టు శక్తులు ఉంటాయని, ఓ గ్రూపును వాళ్లు శత్రువుగా భావిస్తారని పేర్కొన్నారు. అలా శత్రువులుగా భావించే వారిలో మైనార్టీలు ఉండవచ్చు, శరణార్థులు కావొచ్చునని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మీద కూడా ప్రకాశ్ కారత్ మండిపడ్డారు. ఆయన పందొమ్మిదో శతాబ్దపు సామ్రాజ్యవాది అని విమర్శించారు. రాజ్యాలను సొంతం చేసుకోవాలని ట్రంప్ చూస్తున్నట్లుగా ఉందని ఆయన అన్నారు. పనామా కెనాల్, గ్రీన్ ల్యాండ్, కెనడా, గాజా స్ట్రిప్‌లపై ట్రంప్ కన్నేశారని ధ్వజమెత్తారు. ట్రంప్ తరహాలోనే నరేంద్ర మోదీ కూడా ఇజ్రాయెల్‌కు మద్దతు ఇచ్చారని విమర్శించారు. వారి నిర్ణయాలను వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.



## జాదవ్‌పుర్ యూనివర్సిటీలో నిరసనలు.. రాష్ట్ర మంత్రిపై కేసు

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పుర్ యూనివర్సిటీలో నిరసనలు కొనసాగుతున్నాయి. ఇటీవల నిరసనలు ఉద్రిక్తంగా మారడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే తాజాగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బ్రత్య బసుపై కేసు నమోదైంది. గాయపడిన విద్యార్థి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. విద్యార్థులను రక్షించడంలో యూనివర్సిటీ యాజమాన్యం విఫలమైందని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. మంత్రి బ్రత్య వెంటనే రాజీనామా చేయాలని.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ డిమాండ్ చేశాయి. ఈ అంశంపై కొన్ని రోజులుగా విద్యార్థుల నుంచి తీవ్ర నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఇటీవల మంత్రి కాన్వాయ్‌ను ఎస్ఎఫ్ఐకి చెందిన సీపీఐ(ఎం) విద్యార్థి సంఘం చుట్టుముట్టింది. అదే సమయంలో కాన్వాయ్ కాస్త ముందుకు కదలడంతో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. దీంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది. మంత్రి ఉన్న వాహనం అద్దాలను ధ్వంసం చేశారు. పరిస్థితి అదుపు చేసేందుకు పోలీసు సిబ్బంది ఎంతో శ్రమించారు. బ్రత్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు వెంటనే ఆయనను అక్కడి నుంచి ఆస్పత్రికి తరలించారు. తాజాగా గాయపడిన విద్యార్థి ఒకరు మంత్రిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో మంత్రితో పాటు కాన్వాయ్ డ్రైవర్, టీఎంసీ నేత ఓం ప్రకాశ్ మిశ్రా, ఒక ప్రొఫెసర్‌పై కేసు నమోదైంది.

## భారత్‌పై విధిస్తున్న సుంకాల మీద చర్చించేందుకు గోయల్ అమెరికా వెళ్లారు : నిర్మలా సీతారామన్

* అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖతో గోయల్ చర్చిస్తున్నారన్న నిర్మలా సీతారామన్
* భారత్ ఎగుమతులను దృష్టిలో పెట్టుకొని చర్చలు జరుపుతున్నట్లు వెల్లడి
* మనం వినియోగించుకునే వాటికే పన్నులు చెల్లిస్తామన్న ఆర్థికమంత్రి

భారత్‌పై అమెరికా విధిస్తున్న సుంకాల అంశం మీద చర్చించేందుకు కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అమెరికా వెళ్లారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖతో ఆయన చర్చలు జరుపుతున్నారని వెల్లడించారు. భారత్ ఎగుమతులను దృష్టిలో ఉంచుకొని చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. వ్యాపారవేత్తలు, చార్టెడ్ అకౌంటెంట్లు, న్యాయవాదులు, వివిధ సంఘాల నుండి సలహాలు, సూచనలను తీసుకొని బడ్జెట్‌లో మార్పులు చేర్పులు చేస్తామని స్పష్టం చేశారు. బడ్జెట్‌ను పార్లమెంటులో ప్రవేశపెట్టిన తర్వాత గడువు ఉంటుందని, పార్లమెంటు తిరిగి ప్రారంభమయ్యాక ఫైనాన్స్ బిల్లుపై చర్చ జరుగుతుందని గుర్తుచేశారు. ఆ తర్వాతే ఆమోదిస్తామని తెలిపారు. అవసరమైన అభిప్రాయాలు, సూచనలు వస్తే సవరణలు చేసి ఆమోదిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం రోడ్లు, ఆసుపత్రులు, విమానాశ్రయాలను నిర్మిస్తోందని తెలిపారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఒక్కో ఇంటికి తాగు నీరు అందిస్తున్నట్లు వెల్లడించారు. మనం ఉపయోగించుకునే వాటికే పన్నులు చెల్లిస్తామని తెలిపారు. కారును కొనుగోలు చేసిన వారే పన్నులు చెల్లిస్తారని,



కొనుగోలు చేయని వారు పన్ను చెల్లించరని తెలిపారు. రోడ్డును వినియోగించుకున్న వారే టోల్ ట్యాక్స్ చెల్లిస్తారని తెలిపారు. ఉపయోగించుకునే వాటికి పన్నులు చెల్లిస్తేనే రోడ్లు నిర్మించగలమని అన్నారు.

## యూఏఈలో ఇద్దరు భారతీయులకు మరణశిక్ష అమలు..!

యూఏఈలో హత్యలకు పాల్పడ్డారంటూ ఇద్దరు భారతీయులకు ఉరిశిక్షను అమలు చేశారు. ఈ విషయాన్ని మన విదేశాంగశాఖ గురువారం వెల్లడించింది. ఈ సమాచారాన్ని వారి కుటుంబ సభ్యులకు కూడా తెలియజేసింది. మరణశిక్షకు గురైనవారిని మహమ్మద్ రినాష్ అరింగిలొట్టు, మురలీధరన్ పెరుమ్తట్టు వలప్పిల్‌గా గుర్తించారు. వీరిద్దరూ కేరళ వాసులే. ఓ యూఏఈ వాసి హత్య కేసులో మహమ్మద్ రినాష్ దోషిగా తేలాడు. ఓ భారతీయుడిని హత్య చేసిన కేసులో మురలీధరన్‌కు శిక్షపడింది. వీరిద్దరికి అవసరమైన దౌత్య,న్యాయ సాయం అందజేసినట్లు విదేశాంగశాఖ వెల్లడించింది. యూఏఈ జైల్లో భారతీయ మహిళ షెహజాది ఖాన్‌కు ఉరిశిక్షను



అమలు చేసిన విషయం రెండ్రోజుల క్రితమే వెల్లడైంది. ఓ హత్య కేసులో ఆమెకు ఈ శిక్ష విధించారు. దాదాపు ఏడాది పాటు ఆమె న్యాయపోరాటం చేసినా ఫలితం లభించలేదు. ఫిబ్రవరి 15వ తేదీనే ఆమెను ఉరి తీసినా.. ఆ సమాచారం ఆలస్యంగా వారి కుటుంబ సభ్యులకు చేరింది.

## గోల్డ్ స్మగ్లింగ్ కేసులో ట్విస్ట్.. నటి రన్యారావు వెనక 'రాజకీయ నేత'..?

బెంగళూరు: దుబాయ్ నుంచి అక్రమంగా బంగారం తీసుకొస్తూ రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయిన కన్నడ నటి రన్యా రావు వ్యవహారం సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసుకు సంబంధించి ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. అయితే, తాజాగా ఇది మరో మలుపు తిరిగింది. నటి బంగారం స్మగ్లింగ్ వెనక ఓ ప్రముఖ రాజకీయ నాయకుడి హస్తం ఉన్నట్లు కథనాలు బయటికొచ్చాయి. దీంతో ఈ కేసు రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. రన్యా రావు నివాసంలో సోదాలు జరిపిన పోలీసులు.. కొన్ని బంగారు ఆభరణాలు, గోల్డ్ బిస్కెట్లను స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఆభరణాలను బెంగళూరులోని ఓ జువెల్లరీ బొటిక్ నుంచి కొనుగోలు చేసినట్లు గుర్తించారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టగా కీలక విషయాలు తెలిసినట్లు సమాచారం. ఆ ఆభరణాలను ఓ రాజకీయ నాయకుడి తరఫున కొనుగోలు చేసినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో ఆ నగల ధరను ఎవరు చెల్లించారు? ఆ డబ్బు ఎక్కడినుంచి వచ్చిందన్న విషయాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇదిలాఉండగా.. ఈ కేసు గురించి కర్ణాటక ముఖ్యమంత్రి న్యాయ సలహాదారు ఏఎస్ పొన్నన్న చేసిన వ్యాఖ్యలు





కూడా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. నటికి ఉన్న రాజకీయ పరిచయాలతో సంబంధం లేకుండా చట్టం తన పని తాను చేస్తుందని అన్నారు. ఈ కేసులో అధికారుల, రాజకీయ నాయకుల జోక్యం ఉంటే దర్యాప్తులో బయటపడుతుందని తెలిపారు.

*** కిలో బంగారానికి రూ.లక్ష చొప్పన..**

ఇక, రన్యారావు స్మగ్లింగ్ వ్యవహారంలో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గత ఏడాదిలో ఆమె దాదాపు 30 సార్లు దుబాయ్‌కి వెళ్లొచ్చినట్లు తెలుస్తోంది. కిలో బంగారం స్మగ్లింగ్ చేసినందుకు గాను ఆమె రూ.లక్ష చొప్పున వసూలు చేసినట్లు సమాచారం. అంటే ప్రతి ట్రిప్‌కు దాదాపు రూ.12-13లక్షలు తీసుకునేదని ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందట. దీనిపై పోలీసులు సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నారు. ఇటీవల దుబాయ్ నుంచి బెంగళూరుకు 14.2 కిలోల బంగారంతో వచ్చిన ఆమెను.. విమానాశ్రయం నుంచి నిష్క్రమించే చివరి నిమిషంలో అధికారులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. తరచుగా దుబాయ్‌కు వెళ్లడం.. వెళ్లిన ప్రతిసారి ఒకే రకమైన దుస్తులు ధరించడంతో అనుమానం వచ్చి ఆమెపై నిఘా పెట్టగా ఈ స్మగ్లింగ్ వ్యవహారం బయటపడింది. దీంతో ఆమె ఇంట్లో సోదాలు జరిపి అక్కడా రూ.2 కోట్ల విలువైన ఆభరణాలు, మరో రూ.రెండు కోట్లకుపైగా నగదును స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా ఈ కేసులో రన్యా రావు నుంచి రూ.17.29 కోట్ల విలువైన బంగారం, నగదు సీజ్ చేసినట్లు డీఆర్ఐ అధికారులు వెల్లడించారు. అయితే, అక్రమరవాణా చేయాలని తనను కొందరు బ్లాక్‌మెయిల్ చేసినట్లు నటి పోలీసులకు చెప్పడం గమనార్హం.

# పాలలో కల్తీని ఇలా గుర్తించండి!

పాలలో నీరు కలిపిందీ లేనిదీ సులభంగా గుర్తించవచ్చు. ఏటవాలుగా ఉన్న ప్రదేశంపై పాల చుక్క వేయాలి. అది మెల్లగా కదులుతూ తెల్లని గీతని వదిలితే అవి స్వచ్ఛమైన పాలని చెప్పవచ్చు. అదే పాల చుక్క వేగంగా కిందికి జారితే నీళ్లు కలిపినట్లే!

అరగ్లాసు పాలలో అరగ్లాసు నీళ్లు పోసి వేగంగా కలపాలి. ఇలా కలుపుతున్నప్పుడు దట్టంగా నురుగు కనిపిస్తే పాలలో వాషింగ్ పౌడర్ లేదా డిటర్జెంట్ పౌండర్ కలిపినట్లు గుర్తించవచ్చు.

అరగ్లాసు పాలలో రెండు చెంచాల అయోడైజ్డ్ ఉప్పు వేసి బాగా కలపాలి. పాలు నీలం రంగులోకి మారితే అందులో మైదా లేదంటే వేరే ఏదైనా పిండిని కలిపినట్లు తెలుసుకోవచ్చు.

పావు గ్లాసు నీళ్లను బాగా వేడి చేసి అందులో అయిదు చుక్కల టించర్ అయోడిన్ కలపాలి. ఈ నీళ్లను పావు గ్లాసు పాలలో కలపాలి. వెంటనే పాలు నీలం రంగులోకి మారినట్లయితే గంజి పొడి కలిపినట్లు తెలుసుకోవచ్చు.

పావు గ్లాసు పాలలో ఒక చెంచా సోయాబీన్ పొడిని కలపాలి. దీనిలో ఎరుపు రంగు లిట్మస్ పేపర్‌ను ఉంచి పరీక్షించాలి. అది నీలం రంగులోకి మారినట్లయితే పాలలో యూరియా కలిపినట్లు గుర్తించవచ్చు.

బజార్లో దొరికే పీహెచ్ పట్టీని తీసుకు వచ్చి దానిపై ఒక పాల చుక్క వేయాలి. పీహెచ్ నిష్పత్తి 6.4 నుంచి 6.6 మధ్య ఉంటే ఆ పాలు స్వచ్ఛమైనవని చెప్పవచ్చు. అంతకన్నా ఎక్కువ లేదా తక్కువ ఉన్నట్లయితే పాలలో కల్తీ జరిగిందని గుర్తించాలి.





# రోజూ కాటుక పెట్టుకుంటే..
# కళ్లు ఇలా మారతాయి జాగ్రత్త..

**అందాన్ని రెట్టింపు చేయడంలో కాటుకదే పైచేయి అని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. సొగసైన కళ్లు కాటుక పూస్తే వచ్చే అందమే వేరు. కళ్లకు కాటుక పెట్టకుండా మేకప్ పూర్తి అయిందని చెప్పలేరు. అందుకే కళ్లకు కాజల్ అప్లై చేయకుండా బయట అడుగుపెట్టరు అమ్మాయిలు. అందాన్ని రెట్టింపు చేసే కాటుక కళ్ల వెనక ప్రమాదమూ దాగుంది. అందుకే రోజూ కాటుక పెట్టుకునే అలవాటు ఉన్నవాళ్లు ఇది తప్పక తెలుసుకోవాలి. ఈ విషయంలో ఏమరుపాటుగా ఉంటే మీ కళ్లకు వచ్చే సమస్య నుంచి తప్పించుకోవడం కష్టమని హెచ్చరిస్తున్నారు చర్మనిపుణులు..**

మన అమ్మమ్మల నాటి కాలంలో కాటుకను స్వచ్ఛమైన ఆము దం, నెయ్యి ఉపయోగించి ఇళ్లలోనే తయారుచేసేవారు. ఈ కాటుక మలినాలు పోగొట్టి కళ్ల ఆరోగ్యాన్ని కాపాడుతుంది కాబట్టే కాటుక కళ్లకు చాలా మంచిది. చలువ చేస్తుంది అనేవారు. అందంగా కనిపించేలా చేయడం అదనపు ప్రయోజనం. కానీ, ఇప్పుడు మనం వాడేవన్నీ లెడ్, నిల్వ కోసం ఉపయోగించే పారాబెన్స్ వంటి రసాయనాలతో తయారైనవే. ఈ తరహా కాటుకలు రోజూ కళ్లకు అప్లై చేయడం వల్ల మెదడు, ఎముకల్లోకి ఇంకి అనేక సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతాయి. రక్తహీనత, కనురెప్పల్లో నూనె గ్రంథులు తగ్గి అలర్జీలు, కార్నియల్ అల్సర్లు, గ్లకోమా వంటివి సోకుతాయి. పిల్లలకు ఇవి మరీ చేటు చేస్తాయని డెర్మటాలజిస్టులు చెబుతున్నారు.

**ఈ సమస్య రాకుండా జాగ్రత్తపడండి..**

* మేకప్ వేసుకోవడం ప్రమాదం కాదు. దానిని సరిగా తొలగించకపోవడం వల్లే అనేక రకాల సమస్యలు తలెత్తుతాయి. ఏ రకమైన మేకప్ వేసుకున్నా ఇదే సూత్రం వర్తిస్తుందని సూచిస్తున్నారు డెర్మటాలజిస్ట్‌లు. కాటుక విషయంలోనూ అంతే. అరుదుగా వేసుకునేవారైనా ఈ జాగ్రత్తలు పాటించకపోతే కళ్ల కింద నల్లటి వలయాలు ఏర్పడే ఛాన్స్ ఉంది.
* కళ్లను తరచూ రుద్దడం వల్ల కాటుక నేరుగా మీ చర్మంలోని పై పొరల ద్వారా లోపలికి ఇంకే ప్రమాదం ఎక్కువ. ఇది చాలా హానికరం.
* మీకు పెరిఆర్బిటల్ ఎగ్జిమా లేదా డెర్మటైటిస్ (కనురెప్పలు లేదా చర్మం వాపు) ఉన్నట్లయితే కాజల్‌ను అప్లై చేసినపుడు నల్లటి వలయాలు ఏర్పడవచ్చు.
* చర్మంపై ప్రతికూల ప్రభావాలను నివారించాలంటే సహజమైన కాటుక ఉపయోగించేందుకు ప్రయత్నించండి. రసాయనాలతో కూడిన చర్మ సంరక్షణ ఉత్పత్తులు చర్మానికి హాని కలిగిస్తాయి.
* కళ్ల చుట్టూ ఉన్న చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. ఎక్కువ రసాయనాల గాఢత కలిగిన ఉత్పత్తులకు దూరం పెడితేనే శ్రేయస్కరం.
* కాటుక స్థానంలో ఐలైనర్, మస్కారా, ఐషాడో వంటివి వాడితే కంటిలోకి రసాయనాలు అంత సులువుగా పోలేవు. క్లీన్ చేసేటప్పుడు మాత్రం జాగ్రత్త.

### రిలయన్స్ సహా బ్లూచిప్ కంపెనీల మద్దతు..

## రెండో రోజూ లాభాల్లో మార్కెట్లు..

## 74 వేలు దాటిన సెన్సెక్స్..!



**ముంబై:** అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల పరిస్థితులు, క్రూడాయిల్ ధరల తగ్గుముఖంతో దేశీయ స్టాక్ మార్కెట్‌లు వరుసగా రెండో రోజు గురువారం లాభాలతో ముగిశాయి. బీఎస్‌ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్ దాదాపు 610 పాయింట్లు పుంజుకుని 74,000 పాయింట్ల మార్క్‌ను దాటింది. మరోవైపు, ఎన్‌ఎస్‌ఈ-50 సూచీ నిఫ్టీ 22,500 పాయింట్ల ఎగువన స్థిర పడింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ వంటి బ్లూ చిప్ కంపెనీల స్టాక్స్‌కు భారీ కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా గురువారం ప్రారంభ నష్టాల నుంచి రికవరీ సాధిస్తూ బీఎస్‌ఈ-30 సెన్సెక్స్ 609.86 పాయింట్లు (0.83 శాతం) లబ్ధితో 74,340.09 పాయింట్ల వద్ద ముగిసింది. అంతర్గత ట్రేడింగ్‌లో బీఎస్‌ఈ సెన్సెక్స్ 660.57 పాయింట్లు (0.89 శాతం) వృద్ధి చెంది 74,390.80 పాయింట్ల గరిష్టాన్ని తాకింది. మరోవైపు ఎన్‌ఎస్‌ఈ-50 సూచీ నిఫ్టీ 207.40 పాయింట్ల వృద్ధి (0.93శాతం)తో 22,544.70 పాయింట్ల వద్ద స్థిర పడింది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో నిఫ్టీ 219.15 పాయింట్ల (0.98శాతం)తో 22,556.45 పాయింట్ల గరిష్టానికి చేరుకుంది.

బీఎస్‌ఈ సెన్సెక్స్‌లో ఏషియన్ పెయింట్స్, ఎన్‌టీపీసీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా స్టీల్, బజాజ్ ఫిన్ సర్వ్, హిందూస్థాన్ యూనీ లివర్ (హెచ్‌యూఎల్), సన్ ఫార్మా, అదానీ పోర్ట్స్ అండ్ సెజ్, యాక్సిస్ బ్యాంక్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్), టైటాన్, బజాజ్ ఫైనాన్స్ తదితర స్టాక్స్ లాభ పడ్డాయి. మరోవైపు, టెక్ మహీంద్రా, కోటక్ మహీంద్రా బ్యాంక్, జొమాటో, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్ తదితర స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. క్రూడాయిల్ ధరల్లో సర్దుబాటు, చైనా ఉద్దీపన పథకాలతో ఆశావాద దృక్పథం నెలకొనడంతో ఎనర్జీ, మెటల్ సెక్టార్లు పుంజుకున్నాయి.

బీఎస్‌ఈ స్మాల్ క్యాప్ 1.63 శాతం, మిడ్ క్యాప్ 0.65 శాతం పుంజుకున్నాయి. ఎనర్జీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, కమొడిటీస్, యుటిలిటీస్, సర్వీసెస్, పవర్, హెల్త్ కేర్, ఎఫ్ఎంసీజీ, ఇండస్ట్రియల్ సెక్టార్లు లాభాలతో ముగిశాయి. టెలి కమ్యూనికేషన్స్, రియాల్టీ సెక్టార్లు నష్టాలతో స్థిర పడ్డాయి. బీఎస్‌ఈలో 3,007 స్టాక్స్ లాభ పడగా, 989 స్టాక్స్ నష్టపోయాయి. మరో 107 స్టాక్స్ యథాతథంగా కొనసాగాయి.

ఆసియా మార్కెట్లలో టోక్యో, షాంఘై, హాంకాంగ్, సియోల్ మార్కెట్లు లాభాలతో ముగిశాయి. యూరోపియన్ మార్కెట్లలో మిశ్రమ ధోరణి నెలకొంది. బుధవారం వాల్ స్ట్రీట్ మార్కెట్ పాజిటివ్‌గా ముగిసింది. గ్లోబల్ ఆయిల్ బెంచ్‌మార్క్ బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.52 శాతం పెరిగి 69.66 డాలర్లు పలికింది. బుధవారం వరకూ దేశీయ స్టాక్ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్ఐఐ) రూ. 2,895.04 కోట్ల విలువైన పెట్టుబడులు ఉపసంహరించారు.

### అదరహో అనిపిస్తున్న క్రెటా కారు..

#### 2025 ఫేస్ లిఫ్ట్‌ను విడుదల చేసిన హ్యుందాయ్




న్యూఢిల్లీ: మన దేశంలో అత్యంత ప్రజాదరణ పొందిన మిడ్ సైజ్ ఎస్ యూవీలలో హ్యుందాయ్ క్రెటా ఒకటి. దీన్ని 2015లో మొదటి సారిగా విడుదల చేశారు. అప్పటి నుంచి సుమారు 1.2 మిలియన్ల యూనిట్లు అమ్ముడయ్యాయి. గతేడాది జనవరిలో హ్యుందాయ్ రెండో తరం మోడల్ ఫేస్ లిఫ్టెడ్ వెర్షన్ ను విడుదల చేసింది. దానిలో భాగంగా కొన్ని నవీకరణలు తీసుకువచ్చి, వాటికి కొన్ని కొత్త లక్షణాలను చేర్చింది. క్రెటా కార్ల శ్రేణికి మరింత విలువను జోడించడానికి ఈ చర్యలు తీసుకుంది.

హ్యుందాయ్ కొత్త కారు రెండు రకాల వేరియంట్లలో అందుబాటులోకి వచ్చింది. వాటికి ఈఎక్స్ (ఓ), ఎస్ ఎక్స్ ప్రీమియం అనే పేర్లు పెట్టారు. వీటిలో ఈఎక్స్ (ఓ) వేరియంట్ ను పనోరమిక్ సన్ రూఫ్, ఎల్ఈడీ రీడింగ్ లైట్లు తదితర ప్రీమియం లక్షణాలతో రూపొందించారు. మరోవైపు ఎస్ ఎక్స్ ప్రీమియం స్మూత్ లెదర్ సీట్లు, ముందు వెంటిలేటర్ సీట్లు, 8- వే పవర్డ్ డ్రైవర్ సీట్లు, 8- స్పీకర్ బోస్ ఆడియో సిస్టమ్ తదితర ప్రత్యేకతలతో ఆకట్టుకుంటోంది. దీనిలోని టాప్ స్పెక్ ఎస్ ఎక్స్ (ఓ) వేరియంట్ లో ఇప్పుడు రెయిన్ సెన్సార్, వెనుక వైర్ లెస్ చార్జర్, స్మూత్ సీట్లు ఏర్పాటు చేశారు. వీటికి అదనంగా హ్యుందాయ్ ఎస్ (ఓ) వేరియంట్ నుంచి మోషన్ సెన్సార్ తో కూడిన స్మార్ట్ కీని ప్రవేశపెట్టింది. ఈ లక్షణాలతో పాటు రంగుల విషయంలో స్వల్ప మార్పులు జరిగాయి. టైటాన్ గ్రే మ్యాట్, స్టార్రి నైట్ కలర్ ఎంపికలో కెట్రా వేరియంట్లను అందుబాటులోకి తీసుకువచ్చారు. ఇంజిన్, శక్తి పరంగా కొత్త కారులో ఎలాంటి మార్పులు చేయలేదు. 1.5 లీటర్ పెట్రోలు 1497 సీసీ ఇంజిన్ నుంచి 113 బీహెచ్ పీ శక్తి, 143.8 ఎన్ ఎం గరిష్ట టార్క్ విడుదల అవుతుంది. అలాగే 1.5 లీటర్ టర్బో పెట్రోలు 1493 సీసీ ఇంజిన్ నుంచి 157 బీహెచ్ పీ శక్తి, 253 ఎన్ ఎం టార్క్ ఉత్పత్తి అవుతుంది. ఇక 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ నుంచి 114 బీహెచ్ పీ, 250 ఎన్ఎం టార్కు ఉత్పత్తి అవుతుంది.

### జియో ఈవీ సైకిల్‌పై పుకార్ల షికార్లు..

## తక్కువ ధరలో సూపర్ మైలేజ్

**ముంబై:** టెలికం పరిశ్రమలో విప్లవాత్మక విధానాలకు పేరుగాంచిన రిలయన్స్ జియో బడ్జెట్ అనుకూలమైన ఎలక్ట్రిక్ సైకిల్‌తో ఈవీ మార్కెట్‌లోకి ప్రవేశించనుందని సమాచారం. ఈ సమాచారం జియో కంపెనీ అధికారికంగా ధ్రువీకరించనప్పటికీ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న సమాచారం ప్రకారం 2025 నాటికి 400 కి.మీ.ల రేంజ్, రూ. 30,000 ప్రారంభ ధరతో జియో ఈ-సైకిల్ లాంచ్ అవుతుందని తెలుస్తోంది. ముఖ్యంగా రోజువారీ ప్రయాణానికి అనువుగా ఉండేలా ఈ సైకిల్‌ను రూపొందిస్తున్నారని నిపుణులు పేర్కొంటున్నారు. సోషల్ మీడియా బజ్ ప్రకారం ఈ సైకిల్ ధర వేరియంట్‌ను బట్టి రూ. 30,000 నుండి రూ. 50,000 మధ్య ఉంటుందని అంచనా.




జియో ఎలక్ట్రిక్ సైకిల్ రిమూవబుల్ లిథియం-అయాన్ బ్యాటరీతో వచ్చే అవకాశం ఉంది. ఈ బ్యాటరీ వేగవంతమైన ఛార్జింగ్‌కు మద్దతు ఇస్తుందని, డౌన్‌టైమ్‌ను తగ్గిస్తుందని, వినియోగదారులకు సౌకర్యవంతంగా ఉంటుందని భావిస్తున్నారు. స్మూత్ యాక్సిలరేషన్, మల్టీ రైడింగ్ మోడ్‌లు (ఎకో, నార్మల్, స్పోర్ట్), వేగం, బ్యాటరీ స్థాయి, ట్రిప్ వివరాలను ప్రదర్శించే డిజిటల్ ఇన్స్ట్రుమెంట్ క్లస్టర్ ఈ సైకిల్ ప్రత్యేకతలుగా ఉన్నాయి. అధునాతన ఎల్‌ఈడీ లైటింగ్ సిస్టమ్ ఈ సైకిల్‌ను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది. అలాగే జీపీఎస్ ట్రాకింగ్, బ్లూటూత్, మొబైల్ యాప్ ఇంటిగ్రేషన్ వంటి స్మార్ట్ కనెక్టివిటీ ఫీచర్లతో వచ్చే అవకాశం ఉంది.

జియో ఈ-సైకిల్ అధునాతన స్పెసిఫికేషన్లతో ప్రారంభిస్తే జియో ఎలక్ట్రిక్ సైకిల్ భారతీయ ఈ-మొబిలిటీ రంగాన్ని గణనీయంగా ప్రభావితం చేస్తుంది. కచ్చితంగా ప్రజలు ఈ-సైకిల్‌ను పెరుగుతున్న పెట్రోల్ ధరలకు ప్రత్యామ్నంగా ఎంచుకుంటారు. అయితే టెలికం రంగంలో సంచలనాలకు కారణమైన జియో ఈవీ రంగంలో సంచలనాలకు తెర తీస్తుందో? లేదో? వేచి చూడాలి.

### 51 ఏళ్ల వయసులోనూ

# సచిన్ విధ్వంసం

ట్రేడ్ మార్క్ షాట్లతో అలరించిన టెండూల్కర్

ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్‌లో అదరగొట్టిన సచిన్

27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసిన మాస్టర్ బ్లాస్టర్

ట్రేడ్ మార్క్ షాట్లతో ఫ్యాన్స్‌ను అలరించాడు




**న్యూఢిల్లీ:** 51 ఏళ్లు వచ్చేసరికి ఏ అథ్లెట్ అయినా.. దాదాపుగా ఆటకు పూర్తిగా దూరమవుతాడు. ఒకవేళ ఛారిటీ కోసమే.. మరే కారణంతో ఆడాల్సి వచ్చినా.. నామమాత్రపు ప్రదర్శన మాత్రమే చేస్తారు. కానీ సచిన్ టెండూల్కర్ అందుకు భిన్నం. 51 ఏళ్ల వయసులోనూ సచిన్.. బ్యాట్‌తో అద్భుతం చేస్తున్నాడు. తనను అందరూ ఎందుకు మాస్టర్ బ్లాస్టర్ అంటారో నిరూపించుకుంటున్నాడు.

సచిన్ టెండూల్కర్.. ఇంటర్నేషనల్ మాస్టర్స్ లీగ్ 2025లో భాగంగా ఇండియా మాస్టర్స్ తరపున బరిలోకి దిగాడు. భారత జట్టుకు కెప్టెన్ కూడా అతడే. ఏడు దేశాల మాస్టర్స్ జట్టు ఈ టోర్నీలో పాల్గొంటున్నాయి. ఇందులో ఇండియా మాస్టర్స్‌తో పాటు శ్రీలంక మాస్టర్స్, వెస్టిండీస్ మాస్టర్స్, ఆస్ట్రేలియా మాస్టర్స్, దక్షిణాఫ్రికా మాస్టర్స్, ఇంగ్లాండ్ మాస్టర్స్ జట్లు ఉన్నాయి.

ఈ టోర్నీ 9వ మ్యాచ్ వడోదరలోని బీసీఏ స్టేడియంలో ఇండియా మాస్టర్స్, ఆస్ట్రేలియా మాస్టర్స్ తలపడ్డాయి. ఈ మ్యాచ్‌లో సచిన్ టెండూల్కర్ విధ్వంసం సృష్టించాడు. ఓపెనర్‌గా బరిలోకి దిగి.. ఒకప్పటి సచిన్‌ను గుర్తుకు తెచ్చాడు. ఆస్ట్రేలియా బౌలర్లపై ఎదురుదాడికి దిగిన సచిన్.. 27 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. మొత్తంగా 33 బంతుల్లో 64 రన్స్ స్కోరు చేశాడు. అందులో నాలుగు సిక్స్‌లు, ఏడు ఫోర్లు ఉండటం గమనార్హం. ఈ ఇన్నింగ్స్ ద్వారా సచిన్ మళ్లీ పాత జ్ఞాపకాలను తిరిగి తీసుకువచ్చాడు. ఐదు పదుల వయసులోనూ ఎంత ఫిట్‌గా ఉన్నాడో చూపించాడు.



### మార్చి 21 నుంచి 8వ ఎలైట్ ఉమెన్స్

## నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్




**న్యూఢిల్లీ:** 8వ ఎలైట్ మహిళల జాతీయ బాక్సింగ్ పోటీలు ఈనెల 21వ తేదీ నుంచి గ్రేటర్ నోయిడాలోని గౌతమ్ బుద్ధా యూనివర్సిటీలో జరగనున్నాయి. యూపీ బాక్సింగ్ అసోసియేషన్, వరల్డ్ బాక్సింగ్ అండ్ బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించనున్నారు. 1984, జనవరి ఒకటో తేదీ నుంచి 2005 డిసెంబర్ 31వ తేదీ మధ్య జన్మించిన వాళ్లు మాత్రమే ఈ పోటీలకు అర్హులు. ప్రతి రాష్ట్ర యూనిట్ నుంచి సుమారు 10 మంది బాక్సర్లు పోటీపడేందుకు ఛాన్స్ ఇవ్వనున్నారు. మార్చి 10వ తేదీలోగా ఎంట్రీ ఇవ్వాల్సి ఉంటుంది. మార్చి 15వ తేదీన పేర్లను కన్ఫర్మ్ చేస్తారు.ఎలైట్ వుమెన్స్ నేషనల్ చాంపియన్‌షిప్ ద్వారా.. భవిష్యత్తు చాంపియన్లను తయారు చేయవచ్చు అని, యువ ట్యాలెంట్ ను ప్రోత్సహిస్తున్నామని, వారిలో ఉత్తమ క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీస్తున్నామని, ఒలింపిక్స్ ప్రిపరేషన్‌లో ఇది భాగం అవుతుందని, రాబోయే మూడేళ్లలో బాక్సర్లను తీర్చిదిద్దవచ్చు అని బీఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హేమంత కుమార్ కలిటా తెలిపారు. మూడు రౌండ్ల ఫార్మాట్‌లో టోర్నమెంట్‌ను నిర్వహించనున్నారు. ప్రతి బౌట్‌లో మూడు నిమిషాల రౌండ్లు ఉంటాయి. ఒక నిమిషం రెస్ట్ పీరియడ్ ఉంటుంది. టెన్ పాయింట్ స్కోరింగ్ సిస్టమ్‌ను కచ్చితంగా అమలు చేయనున్నారు. వరల్డ్ బాక్సింగ్ టెక్నికల్ అండ్ కాంపిటీషన్ రూల్స్ ప్రకారం టోర్నీ నిర్వహించనున్నారు. ప్రతి రోజూ బాక్సర్లకు వెయిట్ టెస్ట్ చేయనున్నారు.

### వన్డేలకు గుడ్‌బై చెప్పిన

## బంగ్లాదేశ్ క్రికెటర్ ముష్ఫికర్ రహీమ్

**ఢాకా:** బంగ్లాదేశ్ సీనియర్ క్రికెటర్ ముష్ఫికర్ రహీమ్ వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటించాడు. సోషల్ మీడియా అకౌంట్ ద్వారా బుధవారం రాత్రి తన నిర్ణయాన్ని వెల్లడించాడు. తాజాగా జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీలో 37 ఏళ్ల రహీమ్ ఆడాడు. అయితే ఆ జట్టు గ్రూప్ స్టేజ్‌లోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. వన్డేలకు రిటైర్మెంట్ ప్రకటిస్తున్నానని, దేవుడికి కృతజ్ఞత చెప్పుకుంటున్నానని, ప్రపంచ స్థాయిలో తమ జట్టు పాక్షికంగా రాణించిందని, కానీ ప్రతిసారి జట్టు కోసం వంద శాతం అంకితభావంతో ఆడినట్లు చెప్పాడు. ఫేస్‌బుక్ పేజీలో రహీమ్ ఈ విషయాన్ని చెప్పాడు.

2006లో వన్డేల్లో అరంగేట్రం చేశాడు రహీమ్. దాదాపు 20 ఏళ్లు ఆ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 274 వన్డేలు ఆడాడు. బంగ్లా తరపున అత్యధిక వన్డేలు ఆడిన క్రికెటర్‌గా ముష్ఫికర్ రహీమ్ నిలిచాడు. అతను వన్డేల్లో 36.42 సగటుతో 7795 రన్స్ చేశాడు. బంగ్లా బ్యాటర్ తమీమ్ ఇక్బాల్ ఒక్కడే రహీమ్ కన్నా ఎక్కువ పరుగులు చేశాడు. ముష్ఫికర్ తన కెరీర్‌లో 94 టెస్టులు, 102 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టీ20ల నుంచి రహీమ్ రిటైర్మెంట్ ప్రకటించాడు. టెస్టుల్లో మాత్రం ఇంకా ఆడుతున్నాడు.

50 ఓవర్ ఫార్మాట్‌లో ముష్ఫికర్ రహీమ్ 9




సెంచరీలు, 49 హాఫ్ సెంచరీలు చేశాడు. గడిచిన కొన్ని వారాలు తన కెరీర్‌లో ఛాలెంజింగ్‌గా మారాయని, కానీ వాస్తవాన్ని గ్రహించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు రహీమ్ తెలిపాడు. బ్యాటర్‌గానే కాదు.. కీపర్‌గా కూడా రహీమ్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. ముషిఫికర్ తన వన్డే కెరీర్‌లో కీపర్‌గా 297 మందిని ఔట్ చేశాడు. ఆల్ టైం కీపర్ల లిస్టులో సంగక్కర, గిల్‌క్రిస్ట్, ధోనీ, బౌచర్ తర్వాత ముష్ఫికర్ నిలిచాడు.

### రోహిత్ శర్మ కనీసం 25 ఓవర్లు క్రీజులో ఉంటే

## కథ మరోలా ఉంటుంది: గవాస్కర్

ఇటీవల కాలంలో
భారీ ఇన్నింగ్స్ ఆడలేకపోతున్న రోహిత్

ధాటిగా ఇన్నింగ్స్ ఆరంభిస్తున్నా
అదే ఊపు కొనసాగించడంలో వైఫల్యం

రెండేళ్లుగా రోహిత్ శర్మ ఆట
ఇలాగే ఉంటోందన్న గవాస్కర్



**న్యూఢిల్లీ:** ఇటీవల కాలంలో టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఆటతీరులో నిలకడ లోపించింది. అందుకు గణాంకాలే సాక్ష్యం. హిట్ మ్యాన్ ఇన్నింగ్స్ దూకుడుగానే ఆరంభిస్తున్నా... ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోతున్నాడు. ఈ విషయంలో భారత క్రికెట్ దిగ్గజం సునీల్ గవాస్కర్ ఏమంటున్నాడో చూడండి. రోహిత్ శర్మ 25 పరుగులతో సరిపెట్టుకోవడం కాదు, 25 ఓవర్ల పాటు క్రీజులో ఉండేందుకు ప్రయత్నించాలి అంటూ కీలక సూచన చేశాడు. రోహిత్ శర్మ క్రీజులో ఉంటే టీమిండియా 25 ఓవర్లకే 200 వరకు స్కోరు చేయగలదని, తద్వారా ఆ తర్వాత వచ్చే బ్యాట్స్ మెన్ ధాటిగా ఆడేందుకు వీలవుతుందని గవాస్కర్ వివరించాడు. కానీ, గత రెండేళ్లుగా రోహిత్ శర్మ ఆట పడుతూ లేస్తూ అన్నట్టుగా సాగుతోందని, ఇప్పటికీ అతడి ఆటతీరులో మార్పు రావడంలేదని విమర్శించాడు. ఏవో కొన్ని మ్యాచ్ ల్లో సక్సెస్ అవుతున్నప్పటికీ, అతడి నైపుణ్యానికి మచ్చుతునక అనదగ్గ ఇన్నింగ్స్ లు మాత్రం రావడం లేదని అభిప్రాయపడ్డాడు.

ఏ బ్యాట్స్ మన్ అయినా 25-30 పరుగులు చేసి సంతృప్తి చెందగలడా... రోహిత్ కు కూడా ఇది వర్తిస్తుంది... అని పేర్కొన్నాడు. రోహిత్ తొలి ఏడెనిమిది ఓవర్లలో అవుట్ కాకుండా చూసుకోవాలని, కనీసం సగం ఓవర్ల వరకైనా క్రీజులో ఉంటే టీమిండియాకు సానుకూల ఫలితం లభిస్తుందని అన్నాడు.

# శ్రీలీలకు ఆఫర్ల మీద ఆఫర్లు..



**టాకీస్:** శ్రీలీల ప్రధానంగా తెలుగు, కన్నడ సినిమాల్లో హీరోయిన్ గా నటిస్తుంది. ఆమె 2017లో చైల్డ్ ఆర్టిస్ట్‌గా తన కెరీర్‌ను ప్రారంభించింది. 2019 కన్నడ కిస్‌తో పాటు తెలుగులో పెళ్లి సందడి, ధమాకా వంటి చిత్రాలతో మంచి పేరు తెచ్చుకుంది. తెలుగు ఉత్తమ నటిగా అవార్డును గెలుచుకుంది ఈ బ్యూటీ. 14 జూన్ 2001న డెట్రాయిట్ లోని మిచిగాన్ లో ఒక తెలుగు కుటుంబంలో జన్మించింది శ్రీలీల. బెంగుళూరులో పెరిగింది. ఆమె తల్లి స్వర్ణలత బెంగళూరులో గైనకాలజిస్ట్. స్వర్ణలత పారిశ్రామికవేత్త సూరపనేని శుభాకరరావుతో విడిపోయిన తర్వాత స్వర్ణలతకు లీల జన్మించింది. తన చిన్నతనంలోనే 5 ఏళ్ల వయసులో భరతనాట్యంలో శిక్షణ ప్రారంభించింది. ఆమె డాక్టర్ కావాలని కోరికతో 2022లో ఆమె చివరి పూర్తి చేసింది ఈ వయ్యారి. 2017లో చిత్రాంగద అనే తెలుగు హారర్ సినిమాతో సినీ రంగ ప్రవేశం చేసింది. ఈ సినిమలో ప్రధాన పాత్రలో కనిపించిన సింధు తోలాని చిన్నప్పటి పాత్రలో నటించింది . తర్వాత కిస్ అనే కన్నడ చిత్రంతో తొలిసారి కథానాయకిగా కనిపించింది. 2021లో పెళ్లి సందడి సినిమాతో కథానాయకిగా తెలుగు చలనచిత్ర అరంగేట్రం చేసింది. ఇందులో ఈమె నటనకి సైమా వైదికపై మోస్ట్ ప్రామిసింగ్ న్యూకమర్ అవార్డు అందుకుంది. తర్వాత ధమాకా చిత్రంలో హీరోయిన్ గా నటించి బ్లాక్ బ్లాక్ బస్టర్ అందుకుంది. దీనికి సైమా ద్వారా ఉత్తమ నటి అవార్డు అందుకుంది. తర్వాత వరుస సినిమాలు చేసింది. 2023లో స్కంద, భగవంత్ కేసరి, ఆదికేశవ, ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, వంటి సినిమాల్లో నటించగా భగవంత్ కేసరి మాత్రమే ఆకట్టుకుంది. 2024లో గుంటూరు కారంలో నటించిన అది ఆశించిన ఫలితాన్ని అందుకోలేక పోయింది. అదే ఏడాది పుష్ప 2లో స్పెషల్ సాంగ్ చేసి అలరించింది. ప్రస్తుతం నితిన్ సరసన రాబిన్ హుడ్, రవితేజకి జోడిగా మాస్ జాతర, పవన్ కళ్యాణ్ పక్కన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాల్లో నటిస్తుంది. అలాగే తమిళంలో శివ కార్తికేయన్ హీరోగా వస్తున్న పరాశక్తిలో కథానాయికగా నటిస్తుంది. వీటితో పాటు హిందీలో ఓ సినిమాకి సైన్ చేసింది.

# చీర కట్టులో అందాల 'రాశి ఖన్నా'



టాకీస్: 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో టాలీవుడ్‌లో హీరోయిన్‌గా పరిచయం అయిన రాశి ఖన్నా తక్కువ సమయంలోనే పలువురు యంగ్ హీరోలకు జోడీగా నటించింది. కెరీర్ ఆరంభంలో కాస్త బరువు ఎక్కువగా అనిపించిన రాశి ఖన్నా తెలుగు ప్రేక్షకుల కోసం, టాలీవుడ్‌లో ఎక్కువ సినిమాల్లో నటించే అవకాశం కోసం రాశి ఖన్నా బరువు తగ్గింది. బరువు తగ్గిన తర్వాత రాశి ఖన్నా పేరుకు తగ్గట్టు మరింత అందంగా ఉందని అభిమానులు కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా గురించి రెగ్యులర్‌గా ప్రచారం జరిగేలా ఆమె అందం ఉంటుంది అనడంలో సందేహం లేదు. ఈమధ్య కాలంలో తెలుగులో కాస్త ఆఫర్లు తగ్గడంతో తమిళ్‌లో ఈ అమ్మడు బిజీ అయ్యే ప్రయత్నాలు చేసింది. లక్కీగా ఈమధ్య తమిళ్, హిందీలో వరుసగా ఆఫర్లు దక్కుతున్నాయి. తెలుగులో ఈమె చివరగా థాంక్యూ లో నాగ చైతన్యతో కలిసి కనిపించింది. ఆ తర్వాత రాశి ఖన్నా తెలుగు వెండి తెరపై కనిపించలేదు. కానీ హిందీ, తమిళ్‌లో మాత్రం చాలానే సినిమాల్లో నటించింది. ప్రస్తుతం తెలుగులో తెలుసు కదా అనే సినిమాలో నటిస్తుంది. ఆ సినిమాతో రాశి ఖన్నా మళ్లీ టాలీవుడ్‌లో బిజీ కావాలని అభిమానులు కోరుకుంటున్నారు. సోషల్ మీడియాలో రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలను ఈ అమ్మడు షేర్ చేయడం మనం చూస్తూనే ఉంటాం. తాజాగా మరోసారి రాశి ఖన్నా తన అందమైన ఫోటోలను షేర్ చేసింది. ఈసారి చీర కట్టు అందమైన ఫోటోలను షేర్ చేయడం ద్వారా అందరి దృష్టిని ఆకర్షించింది. గ్రీన్ కలర్ చీరలో స్లీవ్‌లెస్ బ్లౌజ్ ధరించి నడుము అందం చూపిస్తూ కన్నుల విందు చేసింది. ఇండస్ట్రీలో అడుగు పెట్టి పదేళ్లు దాటినా, వయసు మూడు పదులకు చేరిన రాశి ఖన్నా మాత్రం ఇంకా 20 ఏళ్ల పడుచు అమ్మాయి మాదిరిగా చాలా అందంగా ఉంది అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో రాశి ఖన్నా అందమైన చీర కట్టు ఫోటోలు వైరల్ అవుతున్నాయి. ఇంతటి అందంకు టాలీవుడ్‌లో ఆఫర్లు దక్కక పోవడం విడ్డూరంగా ఉందని కామెంట్స్ వస్తున్నాయి. రాశి ఖన్నా ప్రస్తుతం చేస్తున్న సినిమాల విషయానికి వస్తే హిందీలో ఒక సినిమాకు కమిట్ అయింది. తెలుగులో తెలుసు కదా సినిమాను చేస్తుంది. సిద్దు హీరోగా నటిస్తున్న తెలుసు కదా సినిమాలో ఇద్దరు హీరోయిన్స్ కనిపించనుండగా, అందులో ఒక హీరోయిన్‌గా రాశి ఖన్నా కనిపించబోతుంది. నీరజ కోన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా కొన్ని కారణాల వల్ల స్లోగా సాగుతుంది. ఈ ఏడాదిలో సినిమా విడుదల అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సిద్దు తో కలిసి నటిస్తున్న ఈ సినిమా తెలుగులో రాశి ఖన్నాను తిరిగి బిజీ చేస్తుందా అనేది చూడాలి.

# 300 కోట్లు దాటిన 'సంక్రాంతికి వస్తున్నాం'



**టాకీస్:** విక్టరీ వెంకటేష్ నటించిన సినిమాలు ప్రేక్షకులకి ఏ మాత్రం బోర్ కొట్టించవు. సూపర్ హిట్ కాకపోయిన మినిమం ఆడతాయి. ఆయన నటించిన తాజా చిత్రం సంక్రాంతికి వస్తున్నాం. ఈ మూవీ సంక్రాంతి కానుకగా వచ్చి సూపర్ హిట్ అయింది. థియేటర్లలో రూ. 300 కోట్లకుపైగా వసూళ్లు సాధించి రికార్డు సృష్టించింది.రీసెంట్‌గా 50 రోజులు కూడా పూర్తి చేసుకుంది. 92 సెంటర్లలో 50 రోజులు పూర్తి కావడంతో ఈ మైలురాయి తమ ఎగ్జిబిటర్లు, పంపిణీదారుల అచంచలమైన అంకితభావంతో సాధ్యమైందని, వారు సినిమాను అన్ని మూలలకు చేరేలా చూశారంటూ దర్శకుడు అనీల్ రావిపూడి ఎమోషనల్ ట్వీట్ చేశారు. అయితే ఇంత మంచి హిట్ తర్వాత వెంకటేష్ కథల విషయంలో చాలా జాగ్రత్తలు పడుతున్నాడట. ఏ సినిమా పడితే ఆ సినిమా చేయకుండా ప్రేక్షకులకి మరింత వినోదం పంచేలా సినిమా చేయాలని అనుకుంటున్నాడట. సంక్రాంతికి వస్తున్నాం సినిమా రిలీజ్ తర్వాత వెంకటేష్ దాదాపుగా 25కు పైగా కథలు విన్నాడని టాక్. అయితే వాటిలో వెంకీ ఒక్కటి కూడా ఓకే చేయలేదు అని టాక్ . ఏ మాత్రం కొద్దిగా బాలేదు అని అనిపించినా ఎంత పెద్ద డైరెక్టర్ అయిన కూడా వెంకటేష్ మొహమాటం లేకుండా నో చెప్పేస్తున్నాడట. అందుకు కారణం గత అనుభవాలే మరి. వెంకటేష్ ప్రధాన పాత్రలో రూపొందిన ఎఫ్ 2, ఎఫ్ 3 చిత్రాలు ఎంత పెద్ద విజయం సాధించాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ సినిమాల తర్వాత శైలేష్ కొలను డైరెక్షన్‌లో సైంధవ్ అనే యాక్షన్ సినిమా చేశాడు. ఆ మూవీ పెద్ద డిజాస్టర్‌గా మిగిలింది. ఆ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని సంక్రాంతికి వస్తున్నాం సక్సెస్‌ను కంటిన్యూ చేయాలని భావిస్తున్న వెంకటేష్ కథల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడట.

# రాంగోపాల్‌వర్మకు హైకోర్టులో ఊరట



టాకీస్: టాలీవుడ్ ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మకి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన దర్శకత్వం లో వచ్చిన కమ్మ రాజ్యంలో కడప రెడ్లు అనే సినిమాకు సంబంధించి నమోదైన కేసులో విచారణపై హైకోర్ట్ స్టే విధించింది. ఈ సినిమాలోని కొన్ని సన్నివేశాలు కొంతమంది వ్యక్తులను ఉద్దేశించి తీయడంతో పాటు విద్వేషాలు రెచ్చగొట్టేలా ఉన్నాయని ఆర్జీవీపై మంగళగిరి సమీపంలోని ఆత్మకూరుకు చెందిన బందారు వంశీకృష్ణ సీఐడీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన సీఐడీ పోలీసులు ఆర్జీవీకి నోటీసులు ఇవ్వడంతో పాటు విచారణకు హాజరుకావాలని కోరారు. అయితే సీఐడీ నోటీసులను సవాల్ చేస్తూ ఆర్జీవీ హైకోర్టును ఆశ్రయించారు. తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశాడు. అయితే ఈ పిటిషన్‌కి సంబంధించి ఆర్జీవీ తరపు న్యాయవాదులు నేడు తమ వాదన వినిపిస్తూ.. 2019లో విడుదలైన సినిమాపై ఇన్నాళ్లకు ఫిర్యాదు చేయడం సమంజసం కాదని వాదించారు. ఈ వాదనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఐదేళ్ల తర్వాత ఇప్పుడు ఫిర్యాదు చేయడం ఏంటి? అని ప్రశ్నించింది. అలాగే ఈ కేసుపై విచారణకు స్టే విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆర్జీవీపై సీఐడీ తదుపరి చర్యలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

# అందం.. అభినయంతో ఆకట్టుకుంటున్న మృణాళిని రవి



టాకీస్: మృణాళిని రవి తమిళం, తెలుగు చిత్రాలలో నటించి కథానాయకిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది. సినిమాల్లో ఆమె నటనతో ప్రేక్షకులను తనదైన శైలిలో ఆకట్టుకుంటుంది ఈ బ్యూటీ. ఎప్పుడు సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉంటూ తన సినిమా అప్డేట్స్, ఫొటోలతో అభిమానులను అలరిస్తుంది ఈ ముద్దుగుమ్మ. తాజాగా కొన్ని ఫోటోలను షేర్ చేసేసింది. చీరలో ఈ బ్యూటీని చుసిన కుర్రాళ్ల వావ్, సూపర్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు. 10 మే 1995న కేంద్రపాలిత ప్రాంతం అయినా పాండిచ్చేరిలో ఓ సాధారణ తమిళ కుటుంబంలో పుట్టి, పెరిగింది మిర్నాళిని రవి. అందంతో పాటు అభినయంతో ప్రేక్షకులను తనదైన నటనకి ఫిదా చేస్తుంది ఈ బ్యూటీ. బెంగుళూరులోని ఈస్ట్ పాయింట్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుండి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో బ్యాచిలర్ డిగ్రీ పట్టభద్రురాలైంది. బెంగుళూరులోనిలో సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్‌గా పనిచేసింది. నటనపై ఆసక్తితో తన ఉద్యోగాన్ని విడిచిపెట్టింది. తమిళం, తెలుగు భాషలలో సుపరిచితురాలు. డబ్స్మాష్ వీడియోలను అప్‌లోడ్ చేస్తూ సోషల్ మీడియాలో పేరు తెచ్చుకుంది. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా ఆమె వీడియోలలో ఒకదాన్ని చూసి తనను ఆడిషన్ కోసం పిలిచి తన సినిమాలో ఎంపిక చేసారు. ఆలా 2019లో సూపర్ డీలక్స్ అనే ఓ తమిళ చిత్రంలో ఏలియన్ అమ్మాయిగా సినీ అరంగేట్రం చేసింది ఈ వయ్యారి భామ. తర్వాత అదే ఏడాది వరుణ్ తేజ్ గద్దలకొండ గణేష్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటించి తెలుగు తెరకు పరిచయం అయింది. 2023లో సయ్యద్ సోహెల్ కి జోడిగా ఆర్గానిక్ మామా హైబ్రిడ్ అల్లుడు, సుధీర్ బాబుకి జంటగా మామా మశ్చేంద్ర చిత్రాల్లో కనిపించింది. ఇటీవల తమిళ రొమాంటిక్ కామెడీ డ్రామా చిత్రం రోమియో సినిమాతో ఆకట్టుకుంది ఈ అందాల తార.

# చిక్కుల్లో రూ.600 కోట్ల సినిమా..

## నిషేధించాలంటూ ఆ వర్గం కలెక్టర్‌కి విజ్ఞప్తి

**టాకీస్:** ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు ఛత్రపతి శంభాజీ మహారాజ్ జీవితకథ ఆధారంగా రూపొందిన చిత్రం ఛావా. లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కించిన ఛావా సినిమా కొద్ది రోజుల క్రితం బాలీవుడ్‌లో విడుదలై మంచి హిట్ అయింది. ఈ సినిమా దాదాపు 600 కోట్లకు పైగా వసూళ్లతో భారతీయ చిత్ర పరిశ్రమలోని అత్యధిక కలెక్షన్స్ సాధించిన సినిమాల లిస్ట్‌లో టాప్ 25లో నిలిచింది. సులువుగా వెయ్యి కోట్లు సాధిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. హిందీలో సినిమా పెద్ద హిట్ కావడంతో మూవీని తెలుగులో భారీ ఎత్తున విడుదల చేయాలని మూవీ రైట్స్ అల్లు అరవింద్ దక్కించుకున్నారు.



ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లో అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభం కాగా, చిత్రానికి డీసెంట్ బుకింగ్ నమోదు అవుతున్నట్లు తెలుస్తుంది. హిందీలో విడుదలైన మూడు వారాల తర్వాత తెలుగులో విడుదల కాబోతున్నా కూడా మూవీని చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక థియేటర్‌లలో ఛావా తెలుగు వర్షన్‌ను రిలీజ్ చేయబోతున్నారు.అయితే మూవీ రిలీజ్ దగ్గర పడుతున్న క్రమంలో మూవీకి అడ్డంకులు ఏర్పడుతున్నాయి. ఏపీలోని ముస్లీం ఫెడరేషన్ నాయకులు ఇటీవల నెల్లూరు జిల్లా కలెక్టర్‌ను కలిసి ఛావా సినిమా విడుదలను అడ్డుకోవాలంటూ విజ్ఞప్తి చేశారు.

ఛావా సినిమా కారణంగా ఉత్తర భారతంలో చాలా చోట్ల గొడవలు జరిగాయని, ఏపీలోనూ అలాంటి మత ఘర్షణలకు అవకాశం ఉంది కనుక సినిమా రిలీజ్ కాకుండా అడ్డుకోవాలని ఏపీ ముస్లీం ఫెడరేషన్ అధ్యక్షుడు జియా ఉల్ హకీ డిమాండ్ చేస్తున్నాడు. ఏపీలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ఉండాలంటే ఛావా సినిమా ఇక్కడ రిలీజ్ కాకూడదు అని ఆయన అంటున్నాడు. ఈ సినిమాపై నిషేధం విధించని పక్షంలో ముస్లిం సంఘాల నేతలతో కలిసి ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ నేపథ్యంలో మార్చి 7న ఛావా రిలీజ్ అవుతుందా? లేదా? అనేది ఉత్కంఠగా మారింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.